ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 32.0
కనిష్ఠం : 24.0

జేసీగా అభిషేక్ గౌడ



ఏలూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఎంజే.అభిషేక్ గౌడ బదిలీపై నియమితుల య్యారు. ఈయన ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా జేసీగా పనిచేస్తున్నారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ముకేష్‌కుమార్ మీనా గురువారం ఉత్తర్వులు జారీచేశారు. గతనెల 15న ఏలూరు జేసీ పి.ధాత్రిరెడ్డి బదిలీ అయిన విషయం విదితమే. ఆంధ్రా క్యాడర్‌కు చెందిన అభిషేక్ గౌడ 2020 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన వారు. కర్ణాటకకు చెందిన ఆయన ఎంబీబీఎస్ చదివారు. 2019లో రెండో ప్రయత్నంలో యూపీఎస్‌సీ సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో 278 ర్యాంకుతో సత్తా చాటారు. తొలి పోస్టింగ్‌ను ఆయన విలేజ్, వార్డు సెక్రటరీల రాష్ట్రస్థాయి అదనపు డైరెక్టర్‌గా విధులు నిర్వహించారు. అనంతరం అల్లూరి సీతారామరాజు జేసీగా గతేడాది జూలైలో విధుల్లో చేరారు. సౌమ్యుడిగా పేరొందిన అభిషేక్ గిరిజనుల సమస్యలను, పౌరసరఫరాల వ్యవస్థను కొంతమేర గాడిలో పెట్టారు. కాగా అభిషేక్ సతీమణి కూడా 2020 బ్యాచ్ ఐఏఎస్ కావడం గమనార్హం.

శేషశైలావాసా.. శ్రీ వేంకటేశా !



ద్వారకాతిరుమల చిన్నతిరుమలేశుని బ్రహ్మోత్సవాలు ముగిశాయి.. గురువారం ఉదయం స్వామి అమ్మవార్ల ఎదుట చూర్ణోత్సవ, వసంతోత్సవాలను అర్చకులు ఘనంగా జరిపారు.రాత్రి శ్రీపుష్ప యాగోత్సవం వేడుకగా నిర్వహించారు. ఆదిశేషుని పాన్పుగా చేసుకుని పవళించిన శ్రీమహావిష్ణువుకు శ్రీదేవి, భూదేవి సేవలు చేస్తున్నట్లు శయన మహావిష్ణువు అలంకరణలో గురువారం భక్తులకు దర్శనమిచ్చారు.

అట్లతద్దోయ్... ఆరట్లోయ్ !



అట్లతద్ది పురస్కరించుకుని గురువారం జిల్లా అంతటా సందడి నెలకొంది..కొత్తగా పెళ్లయిన వారు భక్తి శ్రద్ధలతో నోము చేసుకున్నారు. నదీ తీరాల వద్ద పూజలు చేశారు.. ముత్తయిదువులకు వాయినాలు ఇచ్చుకున్నారు..

మోక్షం లభించేనా?

- 14 ఎత్తిపోతల పథకాల అభివృద్ధికి రూ.31.61 కోట్లతో ప్రతిపాదనలు.. 13 వేల 912 ఎకరాల ఆయకట్టుకు ప్రయోజనం

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో చిన్ననీటి పథకాలు (ఎత్తిపోతల)కు జవసత్వాలు కల్పించే దిశగా టీడీపీ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో వీటి నిర్వహణను గాలికొదిలేశారు. దీంతో తరచూ పథకాల వద్ద మోటార్లు మొరాయించడం, పైప్‌లైన్ లీకేజీలతో కొన్నిచోట్ల నీటి వృథా జరుగుతోంది. రెండు పంటలు పండించే రైతులకు నీటి కోసం పాట్లు తప్పడం లేదు. జిల్లాలో గత 15 నుంచి 20 ఏళ్ల నుంచి నీరందిస్తున్న 14 ఎత్తిపోతల పథకాల నిర్వహణలో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి. వీటికి మోక్షం కల్పించే దిశగా జిల్లా చిన్న నీటిపారుదల సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.దుర్గా గురవయ్య పర్యవేక్షణలో వీటి అభివృద్ధి కోసం 31 కోట్ల 61 లక్షల 90 వేలతో ఇటీ వలే ఏపీఎస్ఐడీసీ కార్పొరేషన్‌కు ప్రతిపాదనలు పంపారు. మోటార్లు, పంపులు, పంపుహౌస్‌లు, పైప్‌లైన్‌లు, లీకుల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంతో పాటు అవసరమైన చోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు బిగింపు తదితర పనులను ప్రస్తావిస్తూ ప్రతిపాదనలు పంపారు. నిధుల మంజూరై పనులు పూర్తయితే 13,912 ఎకరాల ఆయకట్టుకు రెండు పంటలకు నీరందించడానికి అవకాశం ఉంది.



గూటాల ఎత్తిపోతల పథకం

ప్రతిపాదనల వివరాలు

నియోజకవర్గం	పథకం పేరు	ఆయకట్టు (ఎకరాల్లో)	ప్రతిపాదించిన మొత్తం
పోలవరం	కొవ్వాడ	100	47.50లక్షలు
పోలవరం	పోలవరం	750	2కోట్ల65లక్షలు
పోలవరం	గూటాల	2400	5కోట్ల60లక్షలు
పోలవరం	గాడిదబోర్-1	125	73లక్షలు
పోలవరం	గాడదబోర్-2	150	80.50లక్షలు
దెందులూరు	మాగంటి వరలక్ష్మి రవీంద్రనాథ్ చౌదరి	1448	5కోట్ల10లక్షలు
దెందులూరు	ముత్తనవీడు	130	71.50లక్షలు
కైకలూరు	గొల్లగూడెం	520	27.70లక్షలు
నూజివీడు	నూజివీడు	290	కోటి82లక్షల50వేలు
నూజివీడు	సుంకొల్లు-యనమదల	880	కోటి35లక్షలు
చింతలపూడి	ఎర్రకాల్వ 1,2	5900	11కోట్లు
చింతలపూడి	రావికంపాడు	100	11.20లక్షలు
ఉంగుటూరు	పిప్పర	419	42లక్షలు
ఉంగుటూరు	కేసవరం	1200	56లక్షలు
		13,912	31కోట్ల61 లక్షల 90 వేలు

నూజివీడు ఎంఈవో-2 ఎక్కడ?

■ లోపలి పేజీలో..

ఇక భోజనం భేష్

రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలో గల ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఉన్న విద్యార్థులకు మెస్‌ల ఏర్పాటు బాధ్యతను హరే కృష్ణ మూమెంట్ ఫౌండేషన్‌కు అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఏలూరు జిల్లా నూజివీడు క్యాంపస్‌లో ఉన్న మాన్యువల్ మెస్‌లను తన పరిధిలోకి తీసుకున్న ఫౌండేషన్.. రెండు రోజులుగా విద్యార్థులకు భోజన సదుపాయా లను నిర్వహిస్తోంది.

(నూజివీడు - ఆంధ్రజ్యోతి)

- హరేకృష్ణ ఫౌండేషన్‌కు ట్రిపుల్ ఐటీ మెస్ బాధ్యతలు
- మాంసాహారం బాధ్యత మెప్మా లేదా హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థకు..

నూజివీడులోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో ఇప్పటి వరకు భోజన సదుపాయాలు అందించిన పలు కేటరింగ్ సంస్థలకు సంబంధించిన కాంట్రాక్ట్ సెప్టెంబరు నెలాఖరుతో ముగియడంతో అక్టోబరు నుంచి భోజన సదుపాయాల కల్పన కార్యక్రమాన్ని హరేకృష్ణ ఫౌండేషన్‌కు అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఆర్జీయూకేటీ పరిధిలో ఉన్న నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లలో దాదాపు 25 వేల మంది విద్యార్థులు ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ విద్యను పొందుతున్నారు. నూజివీడు, ఆర్కేవ్యాలీ, ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్‌లలో విద్యార్థులు ఉంటుండగా, ఇప్పటివరకు పలు కేటరింగ్ సంస్థల ద్వారా వారికి భోజన సదుపాయాలను అందించారు. గత విద్యాసంవత్సరంలో భోజన నాణ్యతపై ఆరోపణలు రావడంతో ఈ కార్యక్రమాన్ని హరేకృష్ణ ఫౌండేషన్ (అక్షయపాత్ర)కు అందిస్తే ఎలా ఉంటుందో అనే అంశంపై రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆలోచన చేయడంపై 'ఆంధ్రజ్యోతి' గతంలోనే కథనాన్ని ప్రచురించగా అది అక్షరసత్యంగా అక్టోబరు నుంచి (మిగతా 8వ పేజీలో)



నూతన మెస్‌లో భోజనం చేస్తున్న ట్రిపుల్ ఐటీ విద్యార్థినులు

ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల బంద్‌కు సన్నాహాలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్యసేవలను శుక్రవారం నుంచి నిలిపివేయడానికి యాజమాన్యాలు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై జిల్లా అధికారులు దృష్టి సారించారు. నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో వైద్య చికిత్సలు నిలిపివేయడానికి ఏపీ ప్రైవేటు ఆసుపత్రుల సంఘం (ఆశ) ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. ఆ మేరకు వైద్యసేవల నిలిపివేతపై గురువారం సాయంత్రం వరకు తుది నిర్ణయం వెలువడనప్పటికీ, జిల్లాలోని నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లను పూర్తి చేసినట్టు ఎన్టీఆర్ (మిగతా 8వ పేజీలో)

అధికారితో..

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

జిల్లాలో గృహ నిర్మాణాల విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలు, కొత్తగా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు, బిల్లులు పెండింగ్ తదితర అంశాలపై 10వ తేదీ శుక్రవారం ఉదయం 11-12 గంటల మధ్య 'ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్' నిర్వహించనుంది. ప్రజలు

94928 73995

నెంబరుకు ఫోన్ చేసి సమస్యలు చెబితే .. వాటి పరిష్కారానికి ఏలూరు జిల్లా గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జి.సత్యనారాయణ చర్యలు తీసుకుంటారు.

ఏలూరులో దళితుల ర్యాలీ

ఏలూరుటూటౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేటలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టడాన్ని ఖండిస్తూ గురువారం ఏలూరులో దళితులు స్థానిక ఎమ్మెల్యే బడేటి చంటి క్యాంపు కార్యాలయం నుంచి స్థానిక పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో పాల్గొన్న చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ మాట్లాడుతూ దళితుల్ని దగా చేసిన చరిత్ర జగన్ సొంతమని ధ్వజమెత్తారు. ఇకనైనా దళితులపై వైసీపీ మూకల దాడులు ఆపాలంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టిన నీచ సంస్కృతి వైసీపీ నాయకులదేనని ధ్వజమెత్తారు. అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు.రాష్ట్రమాలల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు మాట్లాడుతూ వైసీపీ హయాంలో దళితుల్ని అవమానించి అణచివేయాలని చేసిన ప్రయత్నం నిజం కాదా అని ప్రశ్నించారు. అధిక సంఖ్యలో దళితులు ర్యాలీలో పాల్గొన్నారు. ఎమ్మెల్యే బడేటి చంటి దళితులకు సంఘీభావం తెలిపారు. జిల్లా క్రిస్టియన్ సెల్ అధ్యక్షుడు జుంజు మోజెష్, కార్పొరేటర్ తంగిరాల అరుణా సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆప్కాబ్ చైర్మన్ గన్ని ఖండన



భీమడోలు : చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం దేవళంపేటలోని అంబేడ్కర్ విగ్రహాన్ని వైసీపీ నేతలు అవమానించడంపై ఆప్కాబ్ చైర్మన్ గన్ని వీరాంజనేయులు ఖండించారు. భీమడోలు క్యాంపు కార్యాలయంలో గురువారం దళిత నేతలతో సమావేశమైన ఆయన వైసీపీ కుట్రలపై దుయ్యబట్టారు. ప్రభుత్వంపై బురదజల్లే విధంగా వైసీపీ కుట్రలను ప్రభుత్వం బట్టబయలు చేసిందని, దీనిపై మౌనం వహించిన జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్రం నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేశారు. టీడీపీ నేతలు, దళిత నాయకులు పాల్గొన్నారు.



ఏలూరులో పోస్టర్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు రోషన్, చంటి

పేదలకు ఆర్థిక ప్రయోజనాల కల్పనే లక్ష్యం

- ఎమ్మెల్యేలు చంటి, రోషన్‌కుమార్

ఏలూరు టూటౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పేదలకు ఆర్థిక ప్రయోజనాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలో గురువారం జీఎస్టీ తగ్గింపు పట్ల ప్రజల్లో అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ప్రజలకు ఎన్నో ఆర్థిక మేళ్లను కేంద్రం చేకూర్చిందన్నారు. ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉన్నమట్ల సునీత, కోఆప్షన్ సభ్యుడు జాలా బాలాజీ, లంకపల్లి మాణిక్యాలరావు, పెద్దాడ వెంకటరమణ, ఎం.వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎండ..వాన

- జిల్లాలో విభిన్న వాతావరణం

ఏలూరు సిటీ/పెదపాడు/కుక్కునూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో విభిన్న వాతావరణం నెలకొని ఉంది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత, మధ్యాహ్నం నుంచి మబ్బుల వాతావరణం ఏర్పడి ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో గురువారం పలు ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. పెదపాడు, కుక్కునూరులో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది.గత 24 గంటల్లో జిల్లాలో అత్యధికంగా కలిదిండి మండలంలో 66 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. జిల్లాలో సరాసరి వర్షపాతం 7.6 మి.మీ నమోదైంది. మండవల్లి 52.2, ముదినేపల్లి 17.4, భీమడోలు 13.6, పెదపాడు 10.6, ద్వారకాతిరుమల 9.4, కైకలూరు 9.2, వేలేరుపాడు 9.2, బుట్టాయిగూడెం 7.6, నూజివీడు 5.8, జీలుగుమిల్లి 4.2, జంగారెడ్డిగూడెం 3.6, కుక్కునూరులో 1.8, కామవరపుకోట 1.8, ఆగిరిపల్లి 1.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

జల్లేరు జలాశయం గేట్లు ఎత్తివేత

బుట్టాయగూడెం:శ్రీ గుబ్బల మంగమ్మతల్లి జల్లేరు జలాశయం గేట్లను ఎత్తి 125 క్యూసెక్కుల వరదనీటిని దిగువకు వదులుతున్నట్టు ఏఈ సురేష్ తెలిపారు. అటవీ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు కొండవాగుల ద్వారా వరదనీరు జలాశయానికి చేరడంతో ప్రస్తుతం జలాశయంలో 216.80 ఎంటీఎస్ నీరు ఉందన్నారు. జలాశయం పూర్తి నీటి సామర్థ్యం 217.80 ఎంటీఎస్ కాగా ప్రస్తుతం 216.80 ఎంటీఎస్ ఉండగా 50 క్యూసెక్కుల వరదనీరు వస్తున్నట్టు తెలిపారు.

నేటి నుంచి టీచర్ల బోధనేతర పనులు బహిష్కరణ

- అధికారులకు నోటీసుల అందజేత

ఏలూరు అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన ఆర్థిక ప్రయోజనాల పెండింగ్, విద్యారంగ సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ ఏపీ ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) తల పెట్టిన పోరుబాట మలివిడత ఆందోళనలో భాగంగా శుక్రవారం నుంచి అన్ని పాఠశాలల్లో బోధనేతర, విద్యాశక్తి కార్యక్రమాలను బహిష్కరించేందుకు నిర్ణయించిన ఫ్యాప్టో నాయకులు ఆ మేరకు గురువారం బహిష్కరణ నోటీసులను కలెక్టరేట్ ఏవో నాంచారయ్యకు, విద్యాశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అవధానికి అందజేశారు. అనంతరం ఫ్యాప్టో జిల్లా చైర్మన్ మోహన్, సెక్రటరీ జనరల్ ఆది నారాయణ విలేకరులతో మాట్లాడుతూ బోధనేతర పనులైన టాయిలెట్స్ క్లీనింగ్ రిపోర్ట్, ప్లాంటేషన్ రిజిస్ట్రేషన్, జీఎస్టీ 2.0పై ప్రచారం, సాయంత్రం 4గంటల నుంచి 5గంటల వరకు విద్యాశక్తి కార్యక్రమం పేరిట అదనంగా ఒక గంట ప్రత్యేక తరగతులు బోధించడం, డీఈవో కార్యాలయం కోరే సమాచారాన్ని గూగుల్ షీట్స్‌లో నమోదు చేయడం, తదితర కార్యక్రమాలను టీచర్లు చేయబోరని స్పష్టం చేశారు. ఆ మేరకు శుక్రవారం నుంచి తరగతి గది బోధనతో పాటు, విద్యార్థులు, టీచర్ల హాజరు నమోదు, మధ్యాహ్న భోజన పథకం రిపోర్టు, ఫొటోలు అప్‌లోడ్ చేయడానికిమాత్రమే పరిమితమవుతారని వివరించారు. బోధనేతర పనుల బహిష్కరణ కార్యాచరణ లోకి జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) సభ్యత్వం వున్న మిగతా ఉపాధ్యాయ సంఘాలను భాగస్వామ్యం చేసేందుకు శుక్రవారం చర్చలు జరుపనున్నట్టు తెలిపారు. బహిష్కరణలో పది మెజార్టీ ఉపాధ్యాయ సంఘాలు పాల్గొంటున్నాయన్నారు. జిల్లా అధికారులకు నోటీసులు అందజేసిన ఫ్యాప్టో సభ్య సంఘాల జిల్లా నాయకుల్లో వెంకటేశ్వరరావు, రవికుమార్, రెడ్డిదొర, శివరాం, రమేష్, రామారావు, పవన్‌కుమార్, రామ్మోహన్, ప్రధానోపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు మురళీకృష్ణ, సురేష్, ప్రసాద్, విద్యసాగర్, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.



బోధనేతర పనులు బహిష్కరణ నోటీసును కలెక్టరేట్ ఏవో నాంచారయ్యకు అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఆదర్శగ్రామ యోజనకు కార్యక్రమాలు

సీఎస్‌కు వివరించిన కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రధాన మంత్రి ఆదర్శ్ గ్రామయోజన పథకంలో ఎంపిక చేసిన గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తామని కలెక్టర్ కె.వెట్రిసెల్వి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌కు వివరించారు. ఏపీ సచివాలయం నుంచి కలెక్టర్లతో సీఎస్ గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో 81 గ్రామాల్లో ఎంపిక చేశామని, ఆయా గ్రామాల్లో అన్ని పనులు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, జడ్పీ సీఈవో శ్రీహరి పాల్గొన్నారు.

రాట్నాలమ్మ ఆలయ పాలకవర్గం ప్రమాణ స్వీకారం

- ఆధ్యాత్మికత.. సేవాభావాన్ని పెంపొందించాలి : దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని

పెదవేగి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాట్నాలకుంటలోని రాట్నాలమ్మ ఆలయ క్షేత్రంలో ఆధ్యాత్మికతతో పాటు సేవాభావం లక్ష్యంగా నూతన పాలకవర్గం కృషి చేయాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ సూచించారు. మన్నే శ్రీనివాసరావు చైర్మన్‌గా ఏర్పాటైన ఆలయ నూతన పాలకవర్గ సభ్యుల చేత గురువారం ఎమ్మెల్యే ప్రమాణ స్వీకారం చేయించారు. తొలుత వారితో కలిసి ఆయన అమ్మవారికి పూజలు నిర్వహించారు. ప్రభాకర్ మాట్లాడుతూ ఇక్కడకు వచ్చిన భక్తులు మంచి భావనతో, మనోవికాసంతో తిరిగి వెళ్లాలని, ఆ దిశగా నూతన పాలకవర్గం కృషి చేయాలన్నారు. భక్తులను ట్రాఫిక్ సమస్య తీవ్రంగా వేధిస్తోందని, త్వరలోనే పరిష్కారం చూపుతామన్నారు. అమ్మవారి సన్నిధిలో పేదలకు సామూహిక వివాహాలు జరిపించే దిశగా కృషి చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజలకు మేలైన పథకాలను అమలు చేస్తూ, సంక్షేమ పాలన అందిస్తున్నామన్నారు. అమ్మవారికి రూ.16లక్షల వ్యయంతో వెండి తాపడం చేయించిన దెందులూరు మండలం సోమవరప్పాడుకు చెందిన అన్నే శివకష్ణను ఎమ్మెల్యే అభినందించారు. ఈవో ఎన్.సతీష్‌కుమార్, దెందులూరు ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్, దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం డైరెక్టర్ మోరు శ్రావణి, ప్రజాప్రతినిధులు, పార్టీనాయకులు, అధికారులు పాల్గొన్నారు.



ఆలయ పాలకవర్గంతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే ప్రభాకర్

త్రిశంకు స్వర్గంలో ఉద్యాన వర్సిటీ

వీసీ నియామకంలో తాత్సారం

మద్యం మత్తులో భార్యను హతమార్చిన భర్త

■ లోపలి పేజీలో..

బాణసంచా కేంద్రాల్లో తనిఖీలు



దివ్యమూర్తులకు వసంతోత్సవం జరుపుతున్న ఆలయ అర్చకులు

చూర్ణోత్సవం.. వసంతోత్సవం

ముగిసిన చిన వెంకన్న బ్రహ్మోత్సవాలు

ద్వారకాతిరుమల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చిన్న తిరుమలేశుని బ్రహ్మోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆలయంలో గురువారం విశేషకార్యక్రమాలు జరిగాయి. ఇందులో భాగంగా ఉదయం ఆలయ ప్రాంగణములో రాజాధిరాజ వాహనంపై కొలువు తీరిన స్వామి అమ్మవార్ల ఎదుట చూర్ణోత్సవ, వసంతోత్సవాలను నిర్వహించారు. రాత్రి శ్రీవారికి ద్వాదశ కోవెల ప్రదక్షిణ, శ్రీపుష్పయాగోత్సవం వేడుకగా నిర్వహించారు.

శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసుని ఆలయ కల్యాణ మండపంలో తిరుచ్చి వాహనంపై ఉంచి ప్రత్యేక అలంకారం చేశారు. స్వామి వారికి వసంతాలను సమర్పించారు. అర్చకులు, మహిళలు శ్రీవారిని కీర్తిస్తూ వడ్లను దంచారు. భక్తులపై వేడుకగా వసంతాలను చల్లారు.

ఆలయ ప్రాంగణంలో ఉభయ దేవేరులతో శ్రీనివాసమూర్తికి 12 ప్రదక్షిణలు, 12 సేవా కాలాలు, 12 రకాల పిండి వంటలతో నివేదన రాత్రి కన్నుల పండువగా జరిగింది. ఒక్కో ప్రదక్షిణకు ఒక్కో సేవాకాలాన్ని ఒక్కో పిండి వంటను ఆరగింపు చేశారు. అనంతరం పవళింపుసేవా మందిరాన్ని పుష్పమాలికలతో అలంకరించారు. ఆ తర్వాత శ్రీపుష్పయాగోత్సవ వేడుకను అర్చకులు వేదమంత్రోచ్చరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు.



స్వామివారికి కీర్తిస్తూ వడ్లు దంచుతున్న అర్చకులు



వేంకటేశ్వర స్వామి ఆలయంలో హుండీ ఆదాయం లెక్కింపు

కాళ్లకూరు వెంకన్న హుండీ

ఆదాయం రూ.22.32 లక్షలు

కాళ్ళ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో దేవదాయ ధర్మదాయ శాఖ అధికారులు గురువారం హుండీ ఆదాయం లెక్కించారు. 106 రోజులకు రూ.22,32,317 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో ఎం. అరుణ్‌కుమార్ తెలిపారు. ఆకివీడు సమూహ దేవాలయాల ఈవో అల్లూరి సత్యనారాయణరాజు సమక్షంలో గ్రామ పెద్దలు, భక్తులు, మహిళా మండలి సభ్యులు, దేవస్థానం సిబ్బంది హుండీ ఆదాయం లెక్కించినట్లు ఈవో తెలిపారు.

కాల్వలో ఆక్వా వ్యర్థ జలం వదిలితే చర్యలు

ఆర్‌ఆర్‌ఆర్ హెచ్చరిక

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



కాళ్ల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆక్వా రైతులు పంట కాలువలోకి కలుషిత నీటిని వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు హెచ్చరించారు. బొండాడ పంట కాలువలోకి ఆక్వా వ్యర్థ జలాలు వదలడంపై 'కాల్వలో ఆక్వా వ్యర్థ జలం' శీర్షికన గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి ఆయన స్పందించారు. పెద అమిరంలోని ఆయన కార్యాలయంలో సంబంధిత రైతును హెచ్చరించారు. ఇప్పటికే మన ప్రాంతంలో క్యాన్సర్ రోగాలు పెరుగుతున్నాయన్నారు. దీనికి కారణం తాగునీటి జలాలు కలుషితం కావడమేనని తెలిపారు. రొయ్యలు, చేపలు ఎదగడానికి పలు రకాల కెమికల్స్ వాడుతున్నారని, పట్టుబడి సమయంలో ఈ నీటిని పంట కాలువలోకి వదిలేయడం వల్ల కాలువ జలాలు పూర్తిగా కలుషితమై అవి తాగుతున్న ప్రజలు రోగాలబారిన పడుతున్నారన్నారు.

గణపవరాన్ని పశ్చిమలోనే కొనసాగించాలని వినతి

గణపవరం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): గణపవరం మండలాన్ని పశ్చిమ గోదావరి జిల్లాలోనే కొనసాగించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడిని అఖిలపక్ష నేతలు కోరారు. గురువారం విజయవాడలో వ్యవసాయ మంత్రిని టీడీపీ మండలం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి యాళ్ల సుబ్బారావు ఆధ్వర్యంలో అఖిలపక్ష నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. పశ్చిమగోదావరి జిల్లా కేంద్రం భీమవరానికి 20 కిలోమీటర్ల దూరంలో ఉందని, అదే ఏలూరు 70 కిలోమీటర్ల దూరం ఉండడం వలన అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని వారు మంత్రికి వివరించారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ

కోర్టులో వైసీపీకి చుక్కెదురు

మెడికల్ కళాశాల వ్యవహారంలో జగన్ తీరుపై పితాని ఆగ్రహం

పెనుమంట్ర, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పీపీపీ పద్ధతిలో మెడికల్ కాలేజీల నిర్మాణంపై కోర్టుకు వెళ్లిన వైసీపీకి చుక్కెదురైందని ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ అన్నారు. మెడికల్ కాలేజీల వ్యవహారంలో మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి తీరుపై పితాని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెనుమంట్రలో పల్లెపల్లెకు మన పితాని కార్యక్రమంలో భాగంగా గురువారం జరిగిన సభలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ నిధులతో గత ఐదేళ్లలో మెడికల్ కళాశాల భవనాల నిర్మాణ పనులు పూర్తి చేయలేకపోయారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఉత్తరాంధ్రలో మెడికల్ కాలేజీ కోసం కేవలం రూ.200 కోట్లు మాత్ర మే ఖర్చు చేసి రిషికొండ ప్యాలెస్ కోసం రూ.500 కోట్లు ఖర్చు పెట్టారని విమర్శించారు. మెడికల్ కళాశాలలు త్వరితగతిన పూర్తిచేయడానికే పీపీపీ మోడల్‌లో చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తుంటే జగన్ రెడ్డి రాద్ధాంతం చేస్తున్నారని చెప్పారు. ప్రజల అవసరాల కొరకు మెడికల్ కళాశాలకు అప్పటి వైసీపీ ప్రభుత్వం రూపాయి అయినా మంజూరు చేసిందా అని ప్రశ్నించారు. ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు సామాజిక మాధ్యమాలలో అసత్య ప్రచారం మానుకోవాలని హితవు పలికారు. సర్పంచ్ తాడిపర్తి ప్రియాంక, జవ్వాది సురేష్ చింతపల్లి మంగతాయారు, వెలగల బుల్లి రామిరెడ్డి, రుద్రరాజు వెంకటరామరాజు, గంటా వాసు, కోయా వెంకట కార్తీక్, రవి, తదితరులు పాల్గొన్నారు.

గౌరీ పూజ



గునుపూడి సోమ గుండం వద్ద మహిళల పూజలు

అట్లతద్ది సందర్భంగా యువతులు, మహిళలు గౌరీ పూజలు చేశారు. తద్ది వాయినాలు ఇచ్చి పుచ్చుకున్నారు. తెల్లవారుజామున పెరుగన్నం తిని రోజంతా ఉపవాసం ఉన్నారు. సాయంత్రం చంద్ర దర్శనం అనంతరం స్నానమాచరించి పూజలు చేశారు. కాల్వలు, చెరువులలో దీపాలు వదిలారు. ఊయల ఊగుతూ సందడి చేశారు.



ఆకివీడులో ముత్తయిదువులకు వాయినం ఇస్తున్న యువతి



ఊయలపై యువతి ఉత్సాహం



గౌరీ దేవిని మొక్కుకుంటున్న మహిళలు



వాయినం ఇవ్వడానికి వెళుతున్న మహిళలు



వాయినం ఇస్తున్న మహిళలు



దెందులూరులో ఊయలపై మహిళ

గోల్డెన్ కింగ్స్

ఒకప్పుడు రియల్ ఎస్టేట్ భూమ్ నడిచింది. ఇందులో పెట్టుబడులు పెట్టిన వారంతా నెలల వ్యవధిలోనే అపర కోటీశ్వరులయ్యారు. ఆ తర్వాత రొయ్యల చెరువులు రాజ్యమేలాయి. ఆక్వా సాగు చేపట్టిన వారు సిరిమంతులు అయ్యారు. స్టాక్ మార్కెట్ కాస్త ఒడిదుడుకులకు లోనైనప్పటికి చాలా మంది కుబేరులయ్యారు. ఇప్పుడు గోల్డెన్ ఛాన్స్ బంగారంపై పెట్టుబడి పెట్టిన వారికి దక్కింది. గడిచిన దశాబ్దాలుగా బంగారం కొనుగోలు చేసిన వారందరూ గోల్డెన్ కింగ్స్‌గా మారారు.

- ప్రజల దశను మార్చిన బంగారం
- పెట్టుబడులకు రాజమార్గం.. మదుపు చేసిన వారంతా కుబేరులే..
- ఒకప్పుడు ఆక్వా, రియల్ ఎస్టేట్ రాజ్యమేలితే.. ఇప్పుడు గోల్డెన్ డేస్
- ధర పెరగడమే కాని తగ్గని వైనం

(నరసాపురం-ఆంధ్రజ్యోతి):

- మార్టేరుకు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి మార్కెట్ జోష్ లేకపోవడంతో వున్న సొమ్ముతో ఈ ఏడాది జనవరిలో అర కేజీ బంగారం కొన్నాడు. ఆ సమయంలో గ్రాము బంగారం రూ.7,100 చొప్పున 35 లక్షల 50 వేలు అయ్యింది. అమ్మకుండా అలా ఉంచేశాడు. ప్రస్తుతం గ్రాము ధర రూ.11,800. అంటే అరకేజీ రూ.59 లక్షలు. ఈ లెక్కన ఆయనకు పది నెలల కాలంలో వచ్చిన లాభం అక్షరాలా ఇరవై మూడు లక్షల యాభై వేల రూపాయలు.
- నరసాపురానికి చెందిన ఓ మదుపుదారుడు స్టాక్ మార్కెట్ ఒడిదుడుకులతో పెట్టుబడులను విరమించుకున్నాడు. ఉన్న స్టాక్స్ విక్రయించి వచ్చిన సొమ్ముతో ఫిబ్రవరిలో 400 గ్రాముల బంగారం కొనుగోలు చేశాడు. ఆ సమయంలో గ్రాము ధర రూ.7,800. ఈ తొమ్మిది నెలల్లో పెట్టిన పెట్టుబడికి వచ్చిన లాభం రూ.16 లక్షలు.



- భీమవరానికి చెందిన ఓ ఉద్యోగి కొవిడ్ ముందు అపార్ట్‌మెంట్ ప్లాట్ కొనుగోలుకు సిద్ధమయ్యాడు. ఇంటిలో వున్న 80 కాసుల బంగారానికి వ్యాపారులు రూ.20 లక్షలు రేటు కట్టారు. ఈలోగా ప్లాట్ సిద్ధం కాకపోవడం, కొవిడ్ కారణాలతో కొనుగోలు వాయిదా వేసుకున్నాడు. బంగారాన్ని విక్రయించకుండా ఉంచేయడంతో ఇప్పుడు దాని విలువ రూ.76 లక్షలు.

రాజ్యమేలిన ఆక్వా.. రియల్ ఎస్టేట్

ఇప్పుడు ఇలాంటి వారంతా గోల్డెన్ కింగ్స్‌గా మారారు. గడిచిన ఐదేళ్లుగా బంగారం ధరలు పెరుగుతూ ఉండడంతో పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లో చాలామంది వీటిపై పెట్టుబడులు పెడుతూ లక్షలు సంపాదించారు. ఒకప్పుడు.. అంటే పాతికేళ్ల క్రితం జిల్లాలో ఆక్వా సాగు చేసిన వారంతా కోటీశ్వర్లు అయ్యారు. వైరస్ లేకపోవడం, ధర ఎక్కువగా ఉండటం, విదేశాలకు ఎగుమతులు ఉండటంతో సాగు చేసిన రైతులకు కనకవర్షం కురిపించింది. ఆ సమయంలో చిన్న చిన్న రైతులు కోటీశ్వరులయ్యారు. ఆ తర్వాత హైటెక్ భూమ్, సాఫ్ట్‌వేర్ విప్లవం, విదేశాల్లో ఉద్యోగాలతో చాలా మంది రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులు పెట్టి కోట్లు గడించారు. ప్రస్తుతం ఆ భూమ్ బులియన్ మార్కెట్‌లో నెలకొంది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాలు, వివిధ దేశాల మధ్య యుద్ధాల ప్రభావంతో బంగారం, వెండి ధరలు రోజు రోజుకు కొత్త రికార్డులు నమోదు చేస్తున్నాయి. గడిచిన వందేళ్లలో పెరిగింది ఒక ఎత్తు అయితే ఈ దశాబ్దంలో పెరిగింది మరొక ఎత్తు. ఈ ఏడాది పది నెలల్లో గ్రాముకు రూ.4,800 వరకు పెరిగింది.

ట్రంప్ నిర్ణయాలే కారణం



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాలే బంగారం పెరుగుదలకు ప్రధాన కారణం. చైనా, భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు బంగారం నిల్వలను పెంచుకుంటున్నాయి. గతంలో ఆర్థిక నిల్వలతో డాలర్లు కొనేవారు. ప్రస్తుతం ఇది క్షీణిస్తుండటంతో బంగారాన్ని కొంటున్నారు. బ్యాంకులు కొనుగోలు చేయడంతో డిమాండ్ పెరిగింది.

- రవికుమార్, స్టాక్ బ్రోకర్

ఇప్పట్లో తగ్గేలా లేదు



గతంలో పసిడి పెరిగినా.. ఒకటి, రెండు నెలలు ఉండేది. ఇలా తొమ్మిది నెలలపాటు పెరగడం బులియన్ చరిత్రలో ఇదే తొలిసారి. రియల్ ఎస్టేట్, స్టాక్ మార్కెట్ల పతనం వంటి కారణాలతో చాలా మంది ఈ ఏడాది పసిడి కొనుగోలు చేసి మంచి లాభాలు చూశారు. ప్రపంచ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో ఏ దేశమైనా భారీగా అమ్మకాలు జరిపితే అప్పుడు ధర తగ్గవచ్చు.

- అజిత్‌కుమార్‌జైన్, జిల్లా బులియన్ మాజీ అధ్యక్షులు, నరసాపురం



కలెక్టరేట్ ఆవరణలో ఖాళీగా ఇసుక బకెట్లు

ముందు జాగ్రత్త మూలనబెట్టారు!

- ప్రమాదాల నివారణ పట్టించుకోరు
- కలెక్టరేట్ ఆవరణలో అగ్నిప్రమాద నివారణ చర్యలకు మంగళం
- ఖాళీగా ఇసుక బకెట్లు

ఏలూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపట్టడంలో శ్రద్ధ వహించాల్సిన అధికారులే నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఉన్నతాధికారుల సమక్షంలోనే సంబంధిత అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. కలెక్టరేట్‌లో ప్రమాదాల నివారణ చర్యలు పట్టించుకునే వారే లేరు. అకస్మాత్తుగా అగ్ని ప్రమాదాలు జరిగితే యుద్ధప్రాతిపదికన మంటలను అదుపు చేయడానికి బకెట్లతో ఇసుక సిద్ధంగా ఉండాలి. కలెక్టరేట్ లోపల మెట్ల వెనుక, ఆరుబయట వాహనాల పార్కింగ్ ప్రాంతం, కింద అంతస్తులో ఇసుక బకెట్స్ ఉన్నాయి. ఒక స్టాండ్‌కు సుమారు నాలుగైదు ఎరుపు రంగులో కూడిన బకెట్లు అలంకారప్రాయంగా ఉంటే మరికొన్ని విరిగిపోయాయి. ఇసుక వేయడానికి ఏమాత్రం అనువుగా లేవు. కొన్ని బకెట్లలో బూజు, వ్యర్థాలతో నిండిపోయి ఉన్నాయి. వాటిని పట్టించుకుని ఎంతకాలమైందో అధికారులకే ఎరుక. జరగరాని ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారంటే సమాధానం ఉండదు. జిల్లా అంతటికి మోడల్‌గా ఉండాల్సిన కలెక్టరేట్ ప్రాంగణంలోనే ఇంత నిర్లక్ష్యంగా ఉంటే ఎలా..!?

ఒత్తిడిని దూరం చేద్దాం..



మానసిక సమస్యలపై ప్రజలకు కొన్ని అపోహలున్నాయి. కొందరు సరైన సమయంలో గుర్తించలేకపోతే మరికొందరు వైద్యుడి వద్దకు వెళ్లడానికి సిగ్గపడతారు. ఇంకొందరు ఒత్తిడిలో కూరుకుపోయి మానసికంగా కుంగిపోతారు. ముందుగా జాగ్రత్త పడితే మానసిక సమస్యల నుంచి పూర్తిగా బయట పడవచ్చు. మానసిక సమస్యలతో ఆసుపత్రుల వెంబడి తిరగడం కంటే నివారణకు (ముందస్తు జాగ్రత్త) కృషి చేయడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. శుక్రవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినం సందర్భంగా ప్రత్యేక కథనం

నేడు ప్రపంచ మానసిక ఆరోగ్య దినం

- పిల్లలు, పెద్దల్లో మానసిక సమస్యలు
- పిల్లల్లో గుర్తించడంలో జాప్యం
- పెద్దల్లో బిడియం, నిర్లక్ష్యం
- జాగ్రత్తలు పాటిస్తే పూర్తిగా నయం

తణుకు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మానసిక సమస్యలకు ప్రధానం కారణం ఒత్తిడి, ఆందోళన అని నిపుణులు చెబుతున్నారు. చాలామందికి అలవాట్లు, స్నేహాలు, ఖర్చులతో మానసిక సమస్యలు స్వయంకృతమే. కొందరికి పుట్టుకతోనే సమస్య ఉన్నా గుర్తించడంలో జాప్యం శాపంగా మారుతోంది. చిన్నపిల్లలు సైతం అనేక మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఆటిజం, బుద్ధి మాంద్యం, ఏడీహెచ్‌డీ, సెరిబ్రల్‌పాలసీ వంటి సమస్యలు ముఖ్యమైనవి. ఆటిజం, బుద్ధి మాంద్యం కేసుల్లో మాట, ప్రవర్తనా దోషాలు, ఆలోచన శక్తిలో వెనుకబడి ఉంటారు. కొన్ని సందర్భాలలో రోజువారీ పనులను కూడా స్వతంత్రంగా చేసుకోలేరు. ఈ సమస్యలకు కారణాలపై పరిశోధనలు సాగుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. తల్లి గర్భంతో ఉన్నపుడు మానసిక ఒత్తిడి, తల్లిదండ్రుల అలవాట్లు (డ్రగ్స్ ఆల్కహాలు, స్మోకింగ్), వయసు ముదిరిన తరువాత వివాహాలు, గర్భం ధరించడం, ఎక్కువ సార్లు అబార్షన్లు వంటివి ముఖ్య కారణాలుగా చెప్పవచ్చు.

తొందరగా గుర్తిస్తే మేలు

పిల్లలో ఈ వ్యాధులను ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిది. ఎర్లీ ఇంటర్వెన్షన్ క్వాలిటీ ఫలితాలకు కారణం అవుతుంది. ఉదాహరణకు ఆటిజంను పిల్లల్లో నెలల వయస్సులో గుర్తించవచ్చు. తరువాత థెరపీలు అందుబాటులో ఉన్నాయి. వీటి వల్ల ప్రవర్తనా దోషాలు తగ్గుతాయి. స్పీచ్ పెరుగుతుంది. స్వతంత్ర జీవనానికి వీలైనంత అవకాశం కలుగుతుంది. థెరపీ ఫలితాలు పిల్లల వ్యాధి తీవ్రతను బట్టి ఉంటాయి.

పెద్దల్లో మానసిక సమస్యలకు మూల కారణం ఒత్తిడి. ఒత్తిడిని భరించలేని స్థితిలోనే మానసిక వ్యాధి నిపుణుల వద్దకు వెళతారు. అప్పటికే న్యూరో ట్రాన్స్ మిటర్స్ (మెదడులో రసాయనాలు) సమతుల్యం దెబ్బ తిని ఉండవచ్చని మానసిక వైద్యులు చెబుతున్నారు. కుంగుబాటు (డిప్రెషన్), స్కిజోఫ్రెనియా, మానియా, బైపోలార్ డిజార్డర్, పానిక్ యాంగ్జయిటీ డిజార్డర్ వంటి సమ స్యలకు చేరుకుని ఉండవచ్చు.

అపోహలు అనేకం

మానసిక సమస్య ఇతరులకు చెప్పడానికి, వైద్యుడని సంప్రదించడానికి కొందరు సిగ్గు పడతారు. ఎంత త్వరగా వైద్యుడిని సంప్రదిస్తే అంత తక్కువ నష్టంతో బయటపడవచ్చు. నిపుణుల పర్యవేక్షణలో వాడే మందుల వల్ల నష్టం రాదు. మందులు డాక్టర్ సలహాతో మాత్రమే ఆపాలి. వ్యాధి లక్షణాలు తగ్గిన వెంటనే మందులు ఆపకూడదు. ఈ విధానమే మానసిక వ్యాధులు తిరగబెట్టడానికి కారణం.



బెట్టింగ్‌లతో జీవితం బలి

భీమవరం పట్టణానికి చెందిన గోపాలరావు వయసు 40 ఏళ్లు. అతడి వ్యాపారం బాగానే సాగుతుండగా స్నేహాలు పెరిగాయి, ఖర్చు పెరిగింది. భార్య, పిల్లలపై ఆదరణ తగ్గింది. మొత్తంగా కుటుంబంలో శాంతి కొరవడింది. ఆదాయానికి మించిన ఖర్చుతో బెట్టింగ్‌లను ఆశ్రయించాడు. ఉన్నది కూడా ఊడ్చుకుపోయింది. మానసిక వేదన, ఒత్తిడి నడుమ అలవాట్లతో తాత్కాలికంగా ఆందోళన నుంచి బయట పడేవాడు. కొంత కాలం గడిచేసరికి ఆత్మహత్య ఆలోచనలు వచ్చాయి. ఒక మిత్రుడి సహాయంతో డాక్టర్ వద్దకు తీసుకువెళ్లారు. కానీ ఒక్కరోజు తరువాత ఆత్మహత్య చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు, భార్య వీధిన పడ్డారు. ఈ కేసులో సమస్య తీవ్రరూపం దాల్చిన తరువాత డాక్టర్ వద్దకు వెళ్లారు. మందులు పూర్తిగా వాడి, కొద్దిపాటి జాగ్రత్తలు తీసుకునేందుకు కుటుంబం అతనికి దూరంగా ఉంది. చివరికి తుది శ్వాస విడవక తప్పలేదు. అందుకే మానసిక ఒత్తిడి విషయంలో కుటుంబ సభ్యులు పరిశీలనతో ఉండాలి. అవసరాన్ని బట్టి డాక్టర్‌ను కలవాలి.



పరీక్షల భయం

తణుకు పట్టణానికి చెందిన అనుప్రియ పదో తరగతి చదువుతోంది. బాగానే చదువుతుంది, మంచి ప్రవర్తన. పరీక్షలకు రెండు నెలల ముందు అకస్మాత్తుగా కిందపడిపోయేది. కొద్దిసేపు పరిచర్యల తరువాత లేచేది. నెల రోజుల పాటు కొనసాగింది. ఆ అమ్మాయి స్నానాల గదిలో పడ్డపుడు గాయమైంది. తల్లిదండ్రులు ఫిట్స్‌గా భ్రమ పడ్డారు. కానీ ఇది పరీక్షలపై తీవ్ర భయంతో వచ్చిన సూడో సీజర్. ఆందోళన తగ్గడానికి కొన్ని విధానాలు అవలంబించడం, పరీక్షలను ఎదుర్కొనే మానసిక ధైర్యం థెరపీతో ఆ అమ్మాయి పరీక్షలు రాసింది. మంచి మార్కులు కూడా తెచ్చుకోగలిగింది. ఇక్కడ కేవలం ఆందోళన తగ్గించడంతో అమ్మాయిలో సహజంగా ఉన్న ప్రతిభ ఫలితాన్ని ఇచ్చింది.

ఆటిజం గుర్తించలేకపోయారు..

తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన శ్రేయాన్ష్ వయసు ఎనిమిదేళ్లు. పుట్టిన నాటి నుంచి వయస్సు పెరుగుదల మేరకు నడక, కూర్చోవడం లేదు. మాటలు వచ్చినా రెండేళ్ల వయస్సులో పోయాయి. తల్లిదండ్రులు వచ్చిన మాటలు మర్చిపోయాడనుకున్నారు. నడక ఆలస్యమైతే నాయనమ్మ తన పిల్లలకు కూడా అన్నీ ఆలస్యంగా వచ్చాయని చెప్పేది. శ్రేయాన్ష్ తల్లిదండ్రులు తమ పిల్లాడికి వ్యాధి కాదనుకున్నారు. ఎనిమిదేళ్లకు కూడా మాటలు లేకపోవడం, శూన్యంలోకి చూడడం, తోటి పిల్లలో ఆడుకోకపోవడం, ధ్వని వింటే ఏడ్వడంతో తల్లిదండ్రులు కంగారు పడ్డారు. 'ఈసా' పరీక్ష చేస్తే ఆటిజం అని తేలింది. తల్లిదండ్రులకు జీర్ణించుకోవడం కష్టం. ఈ వయస్సులో థెరపీ ద్వారా ఫలితాలు కొంతమేరకు మాత్రమే సాధ్యం. మూడేళ్ల వయస్సులో జాగ్రత్తలు తీసుకుంటే మంచి ఫలితం వచ్చి ఉండేది. ఇలాంటి సందర్భంలో తల్లిదండ్రులే కాదు, థెరపిస్టులు కూడా చాలా బాధ పడతారు. కానీ చెయ్యగలిగేది చాలా తక్కువ. కాబట్టి సకాలంలో స్పందించడం చాలా ముఖ్యమని గమనించాలి.

ప్రాధాన్యతలు మారడంతో సమస్యలు తీవ్రం



ఆర్థిక సమస్యలతో ఆధునిక మనిషి సహజీవనం చేయాల్సిన పరిస్థితులు దాపురించాయి. నాగరికత పేరుతో జల్సాలు వెర్రితలలు వేస్తున్నాయి. తరాల మధ్య అంత రాలు పెరిగాయి. అలవాట్లు పెరిగి బానిసలు అవుతున్నారు. ప్రాధాన్యతలు మారిపోయాయి. యువత పెళ్లి, పిల్లలు కంటే కెరీర్‌కు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఒకప్పుడు పెద్దల మాట చద్ది మూట. కానీ ఇపుడు పిల్లలు చెప్పిందే వేదం అనే పరిస్థితి నెలకొంది. లేకుంటే పిల్లల అలకలు, హెచ్చరికలు, చచ్చిపోతామంటూ బెదిరింపులు. పెద్దలు పిల్లల దారి పట్టక వేరు మార్గం కనిపించడం లేదు. ఈ పరిణామాలు అనేక సమస్యలకు దారి తీస్తున్నాయి. అందులో మానసిక సమస్య అతి ముఖ్యమైనదిగా నిలుస్తున్నది. ఇటీవలి అధ్యయనాలను పరిశీలిస్తే మానసిక సమస్యలకు గురవుతున్న వారి సంఖ్య బాగా పెరుగుతోంది. చిన్న, పెద్ద వయసుతో పని లేదు. లింగ భేదం లేదు. అనేక మంచి మానసిక సమస్యల చిక్కు ముడులను విప్పలేక, తాను నిత్యం ఎదొర్కొనక తప్పని బిజీ వాతావరణంలో ఇమడలేక సతమతం అవుతున్నారు.

- యనమండ్ర రామకృష్ణ, క్లినికల్ అండ్ చైల్డ్ సైకాలజిస్ట్, తణుకు


భీమవరంలో ప్రజల నుంచి సంతకాలు సేకరిస్తున్న కాంగ్రెస్ నాయకులు

'స్థానిక' ఎన్నికల బరిలో కాంగ్రెస్

పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేడీ శీలం

భీమవరం టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అన్ని గ్రామాల్లోను అభ్యర్థులను నిలబెడుతుందని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ కేంద్ర మంత్రి జేడీ శీలం అన్నారు. భీమవరంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఓటర్ల జాబితా అవకతవకలపై కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్త ఉద్యమం చేపట్టిందన్నారు. దేశవ్యాప్తంగా ఐదు కోట్ల మందితో సంతకాల సేకరణ లక్ష్యమని ఒక్కొక్క నియోజకవర్గంలో 20 వేల సంతకాలు సేకరిస్తున్నామన్నారు. బీజేపీ ప్రజల ఓట్లను దోచుకుని మూడోసారి గద్దెనెక్కిందని విమర్శించారు. పాలక్ వర్మ, మాజీ ఎంపీ కనుమూరు బాపిరాజు, కేబీఆర్ నాయుడు, డీసీసీ అధ్యకుడు పాతపాటి హరికుమార్‌రాజు మాట్లాడారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుంచి మావుళ్లమ్మ ఆలయం వరకు ర్యాలీగా సంతకాల సేకరణ చేపట్టారు. బైపూడి నాగేశ్వరావు, సోడదాసి లూథర్ మార్టిన్, రాజ్‌కుమార్, సీతారామ్, మార్నీడి బాబ్జి హరికిరణ్ పాల్గొన్నారు.


ఉద్యాన పంటలపై తెగుళ్లను శాస్త్రవేత్తలకు వివరిస్తున్న రైతు

పంటలపై చీడపీడలు నివారించాలి

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):ఉద్యాన పంటలపై చీడ పీడలు, వ్యాధుల నివారణ లక్ష్యంగా శాస్త్రవేత్తలు పనిచేయాలని విస్తరణా సంచాలకులు డాక్టర్ బి.గోవిందరాజులు అన్నారు. ఉద్యాన పంటల్లో చీడ పీడల పై వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయ కృషి విజ్ఞాన కేంద్రం వద్ద గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేవీకే ప్రధాన శాస్త్రవేత్త విజయలక్ష్మి మాట్లాడుతూ ఆఫ్రికా నత్తలు ఉభయ గోదావరి జిల్లాల్లో పెనుసవాల్‌గా మారుతున్నాయని, వాటితోపాటు కోకో పంటలలో పూత దశలో ప్లాటినం ప్లాటికోపర్ తెల్లటి బూజు వంటి కదిలే పురుగులు, తదితర సమస్యలు వివరించారు. రైతులు క్షేత్రస్థాయి సమస్యలపై శాస్త్రవేత్తల దృష్టికి తీసుకొచ్చారు. సదస్సులో ఆర్ఎస్‌కే వీహెచ్ఏ ఉద్యోగులు, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీలకు చిరుధాన్యాలపై అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

చిరు ధాన్యాలు ఎంతో అవసరం

ఉండి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):చిరుధాన్యాల వినియోగం ప్రతీ ఒక్కరికి ఎంతో అవసరమని ఉండి కృషి విజ్ఞాన కేంద్రం గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డిబోరా మెషియానా అన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, సిబ్బందికి చిరు ధాన్యాలపై ప్రోగ్రాం కో ఆర్డినేటర్ ఎన్.మల్లికార్జునరావు అధ్యక్షతన గురువారం అవగాహన నిర్వహించారు. డిబోరా మెషియానా మాట్లాడుతూ చిరు ధాన్యాల తో శరీరానికి ఎంతో ఉపయోగకరమని, మిల్లెట్స్‌తో మధుమేహం వంటివి నివారించవచ్చని తెలిపారు. శాస్త్రవేత్తలు ఎ.శ్రీనివాసరావు, బిందు ప్రవీణ్, వినయ్‌లక్ష్మి తదితరులతో పాటు అధికారులు పాల్గొన్నారు.

17న తణుకులో జిల్లా యువజనోత్సవాలు

తణుకు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):యువజన సర్వీసుల శాఖ సెట్‌వెల్ ఆధ్వర్యంలో ఈ నెల 17న జిల్లా యువజనోత్సవాలు తణుకు ఎస్‌కేఎస్‌డీ మహిళా కళాశాలలో జరుగుతాయని ప్రిన్సిపాల్ యు.లక్ష్మీసుందరీబాయి గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారు రాష్ట్రస్థాయికి అర్హత సాధిస్తారని తెలిపారు. 15 నుంచి 29 ఏళ్ల యువత పోటీలకు హాజరు కావచ్చన్నారు. ఆసక్తి గల వారు పి.శివప్రసాద్ 94904 60091 నంబర్‌కు ఫోన్ చేసి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. జానపద నృత్యం, జానపద గీతం. కవిత్వం, వ్యాసరచన, పెయింటింగ్, ఉపన్యాసం, భరతనాట్యం, కూచిపూడి, జానపద నృత్యం సోలో, వెస్ట్రన్ డ్యాన్స్ గ్రూపుల వారీ పోటీలు ఉంటాయని చెప్పారు.

డిసెంబరు 13న జాతీయ లోక్ అదాలత్

భీమవరం క్రైం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):పెండింగ్ కేసుల పరిష్కారం నిమిత్తం భీమవరంలో అన్ని కోర్టుల్లో డిసెంబర్ 13న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్టు మూడో అదనపు జిల్లా జడ్జి లక్ష్మీనారాయణ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ ఈ నెల 18న అసంఘటిత కార్మికులు, బాలల కోసం ప్రవేశపెట్టిన పథకాలపై అవగాహనకు ఒక న్యాయ సేవా సదస్సు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.

రేపు డీఎస్సీ 98 ఎంటీఎస్ టీచర్ల విజ్ఞాపన దీక్ష

తాడేపల్లిగూడెం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):డీఎస్సీ 98 మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) టీచర్ల విజ్ఞాన దీక్ష కార్యక్రమం ఈ నెల 11న విజయవాడ ధర్నా చౌక్ వద్ద నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా నాయకులు కొండవీటి మోహన రావు, పి.బెనర్జీ గురువారం తెలిపారు. తాడేపల్లిగూడెంలో వారు మాట్లాడుతూ ఎంటీఎస్‌పై పనిచేస్తున్న డీఎస్సీ 98 అభ్యర్థులను రెగ్యులర్ చేయాలని, సర్వీస్ కాలపరిమితి 60 ఏళ్ల నుంచి 62 ఏళ్ల వయసుకు పెంచాలని, 12 నెలల జీతాలు విడుదల చేయాలని, ఉద్యోగ విరమణ చేసిన వారికి కనీస పెన్షన్ కల్పించాలనే డిమాండ్లపై విజ్ఞాపన దీక్ష చేపట్టినట్లు వారు వెల్లడించారు.

పచ్చని పొలాల్లో నేవీ ఆయుధ డిపో వద్దు

జీలుగుమిల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పచ్చని పంట పొలాల్లో నేవీ ఆయుధ డిపో ఏర్పాటు చెయ్యవద్దని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ అన్నారు. జిల్లా కార్యదర్శి మండవ కృష్ణ ఆధ్వర్యంలో మడకంవారిగూడెంలో గిరిజనులతో సమావేశం నిర్వహించారు. సమీప పొలాలు పరిశీలించారు. ఏజెన్సీ ప్రాంతంలో కర్మాగారాలు ఏర్పాటు చెయ్యాలంటే గ్రామసభ ఆమోదం పీసా చట్టం అనుమతులు తప్పనిసరి అన్నారు. ఆయుధ డిపో వద్దంటూ గిరిజనులు నినాదాలు చేశారు. కొప్పుల నాగరాజు, కారదం ధారయ్య, ఎండీ మున్నీర్, తగరం బాబురావు, ఇ.భూషణం తదితరులు పాల్గొన్నారు.



ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌ను నియమించకుండా తాత్సారం

- అంతర్గత ప్రొఫెసర్‌లను నియమిస్తే ఇబ్బందులు
- ప్రభుత్వ అధికారులు ఇన్‌చార్జిలుగా ఉన్నప్పుడు పురోగతిలో విశ్వవిద్యాలయం
- రెండు రోజుల క్రితం ఐదు విశ్వ విద్యాలయాలకు వీసీల నియామకం
- ఉద్యాన వర్సిటీపై చిన్నచూపు

(భీమవరం-ఆంధ్రజ్యోతి) :
వెంకట్రామన్నగూడెం డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం పాలన గాడితప్పుతోంది. ఇన్‌చార్జి వైస్ చాన్సలర్‌ను నియమిం చడంలో ప్రభుత్వం విఫలమైంది. విశ్వవిద్యాలయ పరిధిలో పనిచేస్తున్న సీనియర్‌లను లేదంటే ప్రభుత్వ అధికారులను నియమించాలా అనే దానిపై తర్జనభర్జన పడుతున్నట్టు తెలుస్తోంది. వ్యవసాయ, ఉద్యాన, అటవీ శాఖల నుంచి అధికారులను గతంలో భర్తీ చేసిన సందర్భాలున్నాయి. ఐఏఎస్ లేదంటే ఐఎఫ్ఎస్ అధికారులను ఇన్‌చార్జిలుగా నియమించాలన్న వాదన విశ్వవిద్యాలయ వర్గాలనుంచి వినిపిస్తోంది. ప్రభుత్వ అధికారులే ఇన్‌చార్జి వైస్‌ఛాన్సలర్‌లుగా ఉన్నప్పుడు విశ్వవిద్యాలయం అభివృద్ధి చెందింది. ఇటీవల కాలంలోనే సీనియర్ ప్రొఫెసర్‌ను ఇన్‌చార్జి వీసీగా నియమించారు. ఆయన పదవీ విరమణ చేయడంతో వీసీ పదవి ఖాళీ అయ్యింది. ఆయన స్థానంలో మరో అధికారికి పదవీ బాధ్యతలు అప్పగించాయి. రెండు రోజుల క్రితం రాష్ట్రంలో ఐదు విశ్వవిద్యాలయాలకు ప్రభుత్వం వైస్ చాన్సలర్‌లను నియమించింది. ఉద్యాన విశ్వ విద్యాలయంపై మాత్రం చిన్నచూపు చూస్తోంది. గత ఆగస్టు 31వ తేదీన ఇన్‌చార్జి వీసీ పదవి ఖాళీ అయ్యింది. రాష్ట్ర ప్రభుత్వం మరొకరిని తక్షణమే నియమించాల్సినప్పటికీ ఆ పనిచేయలేదు.

నిధుల కేటాయింపులో ప్రభుత్వం అలసత్వం

ఉద్యాన విశ్వ విద్యాలయానికి నిధులు కేటాయించడంలో ప్రభుత్వం అలసత్వం వహిస్తోంది. ప్రభుత్వం ఏదైనా నిధులు మాత్రం మంజూరు చేయడంలేదు. సకాలంలో వేతనాలు ఇవ్వని దుస్థితి ఏర్పడుతోంది. భారత వ్యవసాయ పరిశోధన మండలి నుంచి పరిశోధనా ప్రాజెక్టులు కొద్దోగొప్పో మంజూరవుతున్నాయి. కేంద్రం నుంచి ఈవిధంగా మంజూరయ్యే నిధులకు వినియోగ ధ్రువీకరణ పత్రాల(యూసీ)ను వైస్‌చాన్సలర్ పంపించాలి. ప్రతి మూడు నెలలకు ఒకసారి విశ్వవిద్యాలయంలో అవసరమైన నిధులకు వీసీ అనుమతి ఇస్తారు. అప్పుడే ఆ నిధులను సంబంధిత అధికారులు వెచ్చించాల్సి ఉంటుంది. ఇప్పటికిప్పుడు వైస్‌చాన్సలర్‌ను నియమించడం సాధ్యమయ్యే పనికాదు. సెర్చ్ కమిటీ వేసి ఇంటర్వ్యూలు నిర్వహించాలి. ప్రభుత్వానికి మూడు పేర్లను సూచించాలి. అందులో ఒకరిని గవర్నర్ ఉద్యాన విశ్వవిద్యాలయానికి వైస్‌చాన్సలర్‌గా నియమిస్తారు. ఉద్యాన రంగంలో అనుభవం ఉన్న వ్యక్తులనే వీసీలుగా నియమించనున్నారు. ప్రస్తుతానికి ఇన్‌చార్జిని నియమించాల్సి ఉంది. ప్రభుత్వ అధికారి అయితేనే విశ్వవిద్యాలయం గాడిలో పడనుంది. ఇన్‌చార్జి వీసీగా ఐఎఫ్ఎస్ అధికారి డాక్టర్ చిరంజీవి చౌదరి ఉన్నప్పుడు విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త పరిశోధనా కేంద్రాలను నెలకొల్పారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపి ఆమోదింప చేయడంలో ఐఏఎస్, ఐఎఫ్ఎస్ అధికారులకు సాధ్యమవుతుంది. దాంతో వారినే ఇన్‌చార్జిలుగా నియమించాలన్న వాదన బలంగా వినిపిస్తోంది. ఏ నిర్ణయమైనా ప్రభుత్వం తక్షణమే తీసుకోవాలి. లేదంటే కొద్దిపాటి నిధులకు విశ్వవిద్యాలయం కటకటలాడే దుస్థితి దాపురించనుంది.



బాణసంచా కేంద్రాల్లో తనిఖీలు

దీపావళి పండుగ సమీపిస్తోంది. ప్రజలందరూ పండుగను ఆనందంతో జరుపుకోవాలని ఎదురు చూస్తున్నారు. మరోవైపు బాణసంచా వల్ల ఎలాంటి విపత్తులు కలగకూడదని.. తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఉమ్మడి పశ్చిమలోని బాణసంచా తయారీ కేంద్రాల వారికి, వ్యాపారస్తులకు అధికారులు వివరిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.




ఏలూరు, నరసాపురాల్లో బాణసంచా తయారీ కేంద్రాలను తనిఖీ చేస్తున్న అధికారులు

ఏలూరు క్రైం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) :
ఏలూరు జిల్లాలో కలెక్టర్ వెట్రిసెల్వి, జిల్లా ఎస్పీ కిశోర్, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి టి.శ్రీనివాస్‌ల ఆదేశాల మేరకు రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖాధికారులు తమ పరిధిలో ఉన్న బాణసంచా గోడౌన్ల విక్రయ కేంద్రాలను గురువారం విస్తృతంగా జాయింట్ టీమ్ తనిఖీలు చేపట్టింది. సంబంధిత స్టేషన్ ఎస్ఐ, ఫైర్ స్టేషన్ ఆఫీసర్, మండల రెవెన్యూ అధికారి ఈ ముగ్గురూ కలిసి సిబ్బందితో గోడౌన్లు, విక్రయ కేంద్రాలను తనిఖీ చేసి సూచనలు చేశారు. జిల్లాలో 15 పర్మినెంట్ గోడౌన్లు, విక్రయ షాపు లు ఉన్నాయి. ఆయా షాపులకు ఎన్ని కేజీలు మందుగుండు సామగ్రి విక్రయాలకు అనుమతి ఉందో ఆ దిశగా పరిశీలన జరిపారు. కైకలూరులో ఒక షాపు పర్మిట్‌ను రెన్యువల్ చేయించుకోనట్టు గుర్తించారు. ఆ షాపు ప్రస్తుతం మూతపడి ఉన్నట్టుగా గుర్తించారు.

పార్శిల్ వాహనాల్లో 'మందుగుండు' తరలించొద్దు : డీటీసీ కరీమ్


మాట్లాడుతున్న డీటీసీ షేక్ కరీమ్

పార్శిల్ సర్వీస్ వాహనాల్లో మందుగుండు సామగ్రి తరలించడం నేరమని జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ షేక్ కరీమ్ హెచ్చరించారు. ఏలూరు డీటీసీ కార్యాలయంలో పార్శిల్ సర్వీస్ సంస్థల నిర్వాహకులతో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన సూచించారు. అనంతరం అధికారులు ఆయా పార్శిల్ సర్వీస్ సంస్థల వద్దకు వెళ్లి నోటీసులు అందించారు. ఇన్‌చార్జి ఆర్టీవో ఎస్‌బీ శేఖర్, వాహన తనిఖీ అధికారులు ఎం.డి. జమీర్, జి.స్వామి పాల్గొన్నారు.

నాలుగు బాణసంచా కేంద్రాలకు సీల్.

నరసాపురం : పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం సబ్‌డివిజన్ పరిధిలోని బాణసంచా తయారీ, లైసెన్స్ దుకాణాల గోడౌన్లను గురువారం జాయింట్ యాక్షన్ కమిటీ ఆకస్మికంగా తనిఖీ చేసింది. లైసెన్స్‌లు ఉన్నప్పటికీ నాలుగు తయారీ గోడౌన్లకు సీల్ వేశారు. ఆర్డీవో దాసిరాజు, డీఎస్పీ శ్రీవేదతో పాటు ఫైర్ అధికారి కె.భాస్కర్‌రామం సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. సబ్‌డివిజన్ పరిధిలో నాలుగు బాణసంచా తయారీ కేంద్రాలైన నరసాపురం మండలంలోని లక్ష్మణేశ్వరంలో రెండు, పాలకొల్లు మండలం యాళ్లవారిగరువు, ఆచంట మండ లంలో మరో కేంద్రాన్ని వర్కర్ల సేఫ్టీ విషయంలో సరైన జాగ్రత్తలు చేపట్టక పోవడంతో సీజ్ చేశా మన్నారు. తహసీల్దార్ ఐవీవీ సత్యనారాయణ, సీఐ యాదగిరి, ఎస్ఐ వెంకట సురేష్, ఆర్ఐ సురేఖ ఉన్నారు.

నిబంధనలు పాటించాలి : ఆర్డీవో

ఆకివీడురూరల్ : దీపావళి బాణసంచా విక్రయించే షాపులు నిబంధనలు పాటించాలని, లేకపోతే కఠిన చర్యలు తప్పవని ఆర్డీవో ప్రవీణ్‌కుమార్ హెచ్చరించారు. గురువారం ఆకివీడు మండలం అజ్జమూరులో బాణసంచా గోడౌన్‌ను ఆయన పరిశీలించారు. నిబంధనలు పాటిస్తున్నారో లేదో అని తనిఖీ నిర్వహించారు. ఇన్‌చార్జి తహసీల్దారు ఫారూక్, ఎస్ఐ నాగరాజు తమ సిబ్బందితో గోడౌన్లను పరిశీలించి, అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

పేకాట స్థావరంపై దాడి.. రూ.91 వేలు స్వాధీనం

పెదవేగి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పెదవేగి మండలం భోగాపురంలో పేకాట ఆడుతున్నారనే సమాచారంతో దాడిచేసి, పదిమందిని అరెస్టు చేసి, రూ.91వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్టు సీఐ సి.హెచ్. రాజశేఖర్ తెలిపారు. జూదరులపై కేసు నమోదు చేశామని, వారిని కోర్టులో హాజరుపరుస్తామన్నారు. మారుమూల ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాల ద్వారా నిఘాను పటిష్టం చేశామన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే డయల్ 112కు సమాచారం అందించాలని, వివరాలు గోప్యంగా ఉంచుతామని సీఐ స్పష్టం చేశారు.

మహిళ అదృశ్యంపై కేసు


స్వరూపారాణి

ద్వారకాతిరుమల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ద్వారకా తిరుమల శ్రీవారి ఆలయానికి కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఓ మహిళ అదృశ్యమైంది. దెందులూరు మండలం చల్లచింతలపూడికి చెందిన ఆలపాటి స్వరూపారాణి ఈ నెల 8న కుటుంబ సభ్యులతో కలిసి స్వామి దర్శనార్థం ద్వారకాతిరుమల వచ్చారు. ఆలయానికి వచ్చిన ఆమె తప్పిపోయినట్టు భర్త శ్రీనివాసరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్టు ఎస్.ఐ. టి.సుధీర్ తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96653 నెంబరుకు సమాచారమివ్వాలని ఎస్.ఐ. కోరారు.

దూషించిన నలుగురిపై అట్రాసిటీ కేసు

ఏలూరు క్రైం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కులంపేరుతో దూషించి అవమానపరడంతో పాటు దాడి చేశారనే ఆరోపణలతో నలుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు ఏలూరు టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదైంది. ఏలూరు ప్రభుత్వాసుపత్రి దగ్గర డ్వాక్రా బజార్ కాంప్లెక్స్‌లలో శ్రీకృష్ణా ప్రింటర్స్ దాని పక్కనే ఫుడ్ ఇంజనీర్ షాపులు ఉన్నాయి. ఈ రెండు షాపుల నిర్వాహకుల మధ్య కొంత కాలంగా గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇటీవల వారి మధ్య మళ్ళీ వివాదం రాజుకుంది. దీంతో ఫుడ్ ఇంజనీర్‌కు సంబంధించి పలుకుర్తి ఝాన్సీరాణి, ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆ ఫిర్యాదు మేరకు శ్రీకృష్ణా ప్రింటర్స్‌కు సంబంధించిన మేక సత్యనారాయణ, మేకా శ్రీవర్ధన ఫణీంద్రలతో పాటు రామనపూడి శివ, భజన రామచంద్రరావులపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

విద్యుత్ షాక్‌తో చెరువుల కాపలాదారు మృతి

ముదినేపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):రొయ్యల చెరువుపై విద్యుత్ మోటారును బాగు చేస్తుండగా ఓ వ్యక్తి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించిన హృదయ విదారక సంఘటన ఇది.. ముదినేపల్లి మండలం బొమ్మినంపాడు గ్రామంలోని బోయిన బాలకృష్ణకు చెందిన రొయ్యల చెరువుపై ఉండి మండలం గోరింతోట గ్రామానికి ఎందిన ఒలిగేటి ఏసురాజు(35) కొంతకాలంగా పనిచేస్తున్నాడు. చెరువు గట్టు పైనే మకాం ఉంటున్నాడు. ఈ పరిస్థితుల్లో గురువారం ఉదయం చెరువుకు నీళ్లతోడుతుండగా విద్యుత్ మోటారు ఆగిపోయింది. మోటారును బయటకు తీసి వైర్లను కత్తిరిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి ఏసురాజు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై చెరువు యజమాని ఏసురాజు బంధువుకు సమాచారం అందించారు. సమీప బంధువు దాసరి ప్రసాద్ ఈ సంఘటనపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేశారు.

ఎట్టకేలకు మహిళ క్షేమం..

కొండ వాగులో కొట్టుకుపోయిన మహిళ క్షేమంగా ఒడ్డుకు చేర్చిన పోలీసులు


రక్షించిన మహిళతో పోలీసులు

బుట్టాయగూడెం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కొండవాగులో కొట్టుకుపోయిన గిరిజన మహిళను పోలీసులు గాలించి ప్రాణాలతో కాపాడిన ఘటన బుట్టాయగూడెం మండలం వెలుతురువారిగూడెంలో జరిగింది. బుట్టాయగూడెం మండలం జైనవారిగూడెం నుంచి గురువారం ఉదయం అత్తవారి ఇంటికి వెలుతురువారిగూడెం వెళ్లడానికి ఇరపా అన్నామణి బయల్దేరింది. రెండు గ్రామాల మధ్య జల్లేరు కొండవాగు ఉంది. బుధవారం రాత్రి శ్రీగుబ్బల మంగమ్మ తల్లి జల్లేరు జలాశయం నుంచి వదర విడుదల చేయడంతో జల్లేరు కొండవాగు ఉధృతి పెరిగింది.వాగు ఉధృతిని అంచనా వేయలేని అన్నామణి అవతలి ఒడ్డుకు చేరే ప్రయత్నంలో ప్రవాహానికి కొట్టుకుపోయింది. సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్థులు అన్నామణి కోసం వాగు వెంట గాలించారు. కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారమిచ్చారు. సమాచారం అందుకున్న ఎస్.ఐ. డి.దుర్గామహేశ్వరరావు వెంటనే స్పందించి తన సిబ్బందితో వాగు వెంట గాలింపు చర్యలు చేపట్టారు. వాగును దాటిన వద్ద నుంచి కిలో మీటరు దూరంలో లోతు తక్కువ ప్రాంతంలో ప్రాణ భయంతో కొట్టుకుంటున్న అన్నామణిని బయటకు తీసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వాగులో కొట్టుకుపోయిన మహిళను ప్రాణాలతో కాపాడిన ఎస్.ఐ, సిబ్బందిని డీఎస్పీ వెంకటేశ్వరరావు, సీఐ వెంకటేశ్వరరావు అభినందించారు. డీఎస్పీ మాట్లాడుతూ వాగులు ఉధృతంగా వస్తున్న సమయంలో ప్రజలు వాగులను దాటేసాహసం చేయవద్దన్నారు. అత్యవసర పరిస్థితి తలెత్తితే వెంటనే పోలీసులకు(112) లేదా స్థానిక విపత్తుల సహాయక బృందాలకు తెలియజేయాలన్నారు.

నిద్రపోతున్న వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

గంటల వ్యవధిలో ఛేదించిన పోలీసులు
రికవరీ చేసిన బంగారం అందజేత


రికవరీ చేసిన బంగారం అందజేస్తున్న ఎస్.ఐ

పెదపాడు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు చోరీ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు అందిన గంటలోపే కేసును ఛేదించారు. పెదపాడులో అడ్డగర్ల సీతారావమ్మ(70) తెల్లవారుజామున ఇంటి ఆవరణలో నిద్రపోతోంది. అదే సమయంలో స్థానిక కొండదొరలకాలనీకి చెందిన దండసు లక్ష్మి అనే మహిళ వృద్ధురాలి మెడలోని 4 తులాల బం గారు గొలుసును దొంగిలించింది. బాధితురాలు వెంటనే పెదపాడు పోలీసులకు ఫిర్యాదుచేసింది. స్పందించిన ఎస్.ఐ. కట్టా శారదాసతీశ్ సిబ్బంది తో విచారణ నిర్వహించి స్థానిక కొండదొరల కాలనీకి చెందిన లక్ష్మి చోరీకి పాల్పడినట్టు గుర్తించి ఆమెను అదుపులోకి తీసుకుని గొలుసును రికవరీ చేసి వృద్ధురాలికి అందజేశారు పెదపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. తెల్లవారు జామున జరిగిన చోరీ కేసును అతి తక్కువ సమయంలో ఛేదించిన ఎస్.ఐ. సతీశ్, సిబ్బందిని పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు.

పోలీసుల అదుపులో దారి దోపిడీ వ్యక్తి..

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలం నవాబుపాలెం, ఆరుళ్ల మధ్యలో కారు, మోటారు సైకిళ్లపై దాడికి పాల్పడుతూ దోపిడీ చేస్తున్న ఓ వ్యక్తిని స్థానికులు రూరల్ పోలీసులకు అప్పగించారు. బుధవారం రాత్రి జనసేన మండలాధ్యక్షుడు అడపా ప్రసాద్ కారు అద్దాలు పగలగొట్టిన వ్యక్తిని పట్టుకున్నారు. ఆ వ్యక్తి నిడదవోలుకు చెందిన వ్యక్తిగా చెబుతున్నారు. దారి దోపిడి దొంగలు ఎవరూ లేరని ప్రజలు భయపడాల్సిన అవసరం లేదని రూరల్ ఎస్.ఐ. ప్రసాద్ తెలిపారు. పోలీసులను రాత్రిగస్తి ముమ్మరం చేశామన్నారు,

మహిళ మెడలో గొలుసు చోరీ..

భీమవరం క్రైం: నడిచి వెళ్తున్న మహిళ మెడలో నుంచి ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బంగారం తాడు సూత్రాలు అపహరించుకుపోయారు. భీమవరంలోని 15వ వార్డు చిన్ని వారి వీధికి చెందిన నక్కాని వెంకటరమణ గురువారం సాయంత్రం పని మీద బయట నడుచుకుంటూ వెళ్తున్నారు. అదే సమయంలో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై మాస్కులు వేసుకుని వచ్చారు. ఆమె మెడలో ఉన్న 33 గ్రాముల బంగారం తాడు, సూత్రాలను లాక్కుని పరారయ్యారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వన్‌టౌన్ ఎస్ఐ మోహన్ వంశీ తెలిపారు.



నాగలక్ష్మి మృతదేహం.. మృతురాలి ఫైల్ ఫొటో

మద్యం మత్తులో భార్యను హతమార్చిన భర్త

ఏలూరుక్రైం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):చెడు వ్యసనాలకు బానిసైన భర్త భార్యపై అనుమానంతో మద్యం మత్తులో వచ్చి సుత్తితో తలపై మోది, కత్తెరతో పొడిచి దారుణంగా హతమార్చాడు.ఏలూరులోని శనివారపుపేట హైస్కూలు సమీపంలో ఉన్న కాలనీలో గురువారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. ఆ కాలనీకి చెందిన కూతాడి నరేశ్, నాగలక్ష్మి(32)కి ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు బాలాజీ 9వ తరగతి చదువుతుండగా, చిన్న కుమారుడు ఫణీంద్ర ఏడవ తరగతి చదువుతున్నాడు. నరేశ్ తాపీమేస్త్రీగా పని చేస్తున్నాడు. పేకాట, అతిగా మద్యం తాగడం, కోడిపందాలు వంటి చెడు వ్యసనాలు ఉన్నాయి. భార్యపై తరచూ అనుమానంతో వేధిస్తూ ఉంటాడు. ద్వారకాతిరుమలలో బంధువుల ఇంట్లో వివాహం నిమిత్తం గురువారం ఉదయం వెళ్లి సాయంత్రానికి ఇంటికి చేరుకున్నారు.పెళ్లి సందర్భంగా బుధవారం నుంచే నరేశ్ మద్యం తాగుతూ పిచ్చిపిచ్చిగా ప్రవర్తించాడని బంధువులు చెబుతున్నారు. పెళ్లికి వెళ్లి వచ్చిన తరువాత సాయంత్రం మూడు గంటల ప్రాంతంలో గొడవపడి సుత్తితో నాగలక్ష్మి తలపై మోది, కత్తెరతో దారుణంగా పొడిచాడు. విషయం తెలుసుకున్న బంధువులు అక్కడికి వెళ్లి రక్తపు మడుగులో ఉన్న నాగలక్ష్మిని ఆటోలో ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించినట్టు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న ఏలూరు త్రీ టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు ఘటనా స్థలాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు నరేశ్ పోలీసులకు లొంగిపోయినట్టు సమాచారం.

నూజివీడు ఎంఈవో-2 ఎక్కడ?

ఎటువంటి సమాచారం లేకుండా సెలవు
డీఈవో ఆదేశాలతో డీవైఈవో విచారణ
కుటుంబ సభ్యుల చిరునామాపై వాకబు

ఏలూరుఅర్బన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):విధులకు గైర్హాజరవుతుండటంపై నూజివీడు ఎంఈవో-2 ఎస్. జమలయ్య గురించి వాకబు చేసి నివేదిక సమర్పించాలని డీఈవో వెంకటలక్ష్మమ్మ మౌఖిక ఆదేశాల మేరకు బుధవారం నూజివీడు ఉప విద్యాశాఖాధికారి సుధాకర్ విచారణ నిర్వహించి రిపోర్టును గురువారం జిల్లా విద్యాశాఖకు పంపించారు. దీనిపై డీవైఈవో సుధాకర్ వివరిస్తూ గత నెల 24న ఎంఈ వో-2 తన కార్యాలయానికి వచ్చారని, తదుపరి ఈ నెల 3న చివరి సారిగా తనతో ఫోన్‌లో మాట్లాడారని, అప్పటి నుంచి ఇంతవరకు ఆయన కనబడలేదన్నారు. విధులకు సెలవు పెడుతున్నట్టుగా ఎటువంటి సమాచారం ఇవ్వలేదని, ఆ మేరకు లీవ్ యాప్‌లో కూడా నమోదు చేయకపోవడం, డ్యూటీ చేయడం లేదని తన దృష్టికి వచ్చాయని తెలిపారు. ఆయన ఫోన్ కూడా స్విచ్ఛాఫ్‌లో ఉందని వివరించారు. జమలయ్యతో పాటు ఒకే కార్యాలయంలో విధులు నిర్వర్తించే ఎంఈవో-1, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లను కూడా ఆ రాతీయగా ఆయన ఆఫీసుకు రావడంలేదని చెప్పారన్నారు. ఈ విషయాలన్నీ డీఈవోకు అందజేసిన విచారణ నివేదికలో తెలియజేశానన్నారు. తదుపరి జమలయ్య కుటుంబ సభ్యుల చిరునామా తెలుసుకుని వాకబు చేయాల్సి ఉందన్నారు. కాకినాడ ఆర్జేడీ, డీఈవో ఆదేశాల మేరకు మండలంలో విద్యాశాఖ కార్యకలాపాల నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్ల గురించి చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని స్పష్టం చేశారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

భీమడోలు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సెట్‌వెల్ సీఈవో కె.ఎస్.ప్రభాకర్ అన్నారు. భీమడోలు మాధురి కళాశాలలో జిల్లా యువజన సంక్షేమ శాఖ, చైతన్య యువజన సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, మత్తుపదార్థాల వ్యతిరేకతపై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. సెట్‌వెల్ సీఈవోతో పాటు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి వరలక్ష్మి, పాముల మాన్‌సింగ్, టూరిజం అధికారి పట్టాభిరామన్న, తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలను తరలిస్తే కఠిన చర్యలు తప్పవు

లింగపాలెం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): గంజాయి, సారా, మద్యం వంటి వాటిని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ధర్మాజీగూడెం ఎస్ఐ కె.వెంకన్న తెలిపారు. ధర్మాజీగూడెంలో గురువారం సిబ్బందితో కలసి వాహనాల తనిఖీ జరిపారు. ఈ సందర్భంగా వాహనదారులకు హెల్మెట్‌ధారణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రిపుల్ రైడింగ్, మైనర్‌డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపేవారికి డ్రంక్‌అండ్‌డ్రైవ్ పరీక్షలు నిర్వహించి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

23లోగా లేఅవుట్‌లు క్రమబద్ధీకరణ చేసుకోవాలి

చింతలపూడి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఏపీ అనధికార లేఅవుట్ క్రమబద్ధీకరణ పథకం వినియోగించుకోవాలని, అనధికార లేఅవుట్‌లలో 2025 జూన్ 30వ తేదీకి ముందు ప్లాట్‌లు కొని ఇబ్బందులు పడుతున్న వారికి ప్రభుత్వం ఈ సదావకాశం ఇచ్చిందని మునిసిపల్ కమిషనర్ అంబటి రాంబాబు తెలిపారు. అనధికార లేవుట్‌లు రిజిస్ట్రేషన్ అయినా నగర పంచాయతీ ద్వారా నిర్ణయించబడిన రుసుం చెల్లించి క్రమబద్ధీకరించుకునే అవకాశం వదులుకోవద్దని తెలిపారు. ఈ విధంగా క్రమబద్ధీకరణ చేసుకోకపోతే ఆ స్థలంలో భవిష్యత్తులో భవన నిర్మాణం చేపట్టడం అనర్హులుగా పరిగణించబడతారని తెలిపారు. సంబంధిత సర్వే నెంబర్‌ను బ్లాక్ చేస్తామన్నారు. ఏ ప్రభుత్వ సేవలు అందవని, క్రమబద్ధీకరణ అవకాశాన్ని ఈ నెల 23వ తేదీలోగా వినియోగించుకోవాలని సూచించారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలు రికవరీ చెయ్యాలి

జీలుగుమిల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): 2018-19 సంవత్సరంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా పొందిన స్వయం ఉపాధి రుణాలు రికవరీ చెయ్యాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ముక్కంటి అన్నారు. జీలుగుమిల్లి తహసీల్దారు కార్యాలయంలో పంచాయతీ వెల్ఫేర్ అసిస్టెంట్‌లతో సమావేశం నిర్వహించారు. మండలంలో గతంలో 5 యూనిట్‌ల ద్వారా రుణాలు పొందిన వారి నుంచి రికవరీకి తీసుకోవాల్సిన చర్యలపై పంచాయతీ సిబ్బందితో చర్చించారు. రడీమేడ్ క్లాత్, ఫ్యాన్సీ, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ వంటి వ్యాపారాల నిమిత్తం 5యూనిట్‌లకు సంబంధించి సుమారు రూ.16 లక్షల రుణాలు పొందారన్నారు. రాయితీ రూ.లక్షా 69వేలు పోను మిగిలిన సొమ్ము లబ్ధిదారులు నుంచి రాబట్టాల్సి ఉందన్నారు. ఇంకా ఆయా లబ్ధిదారులు నుంచి రూ.4 లక్షల 63వేల 412 రూపాయలు రావాల్సి ఉందన్నారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడికి సత్కారం



ఏలూరు రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఏలూరు రూరల్ మండలం మానూరు మండలం పరిషత్ పాఠశాలకు చెందిన తెర ప్రసాద్ ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్న సందర్భంగా పలు స్వచ్ఛంద, ఉపాధ్యాయ సంఘాల నాయకులు గురువారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆమలోద్భవి హైస్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ ఇంజేపౌల్ మాట్లాడుతూ ఉపాధ్యాయుడిగా అంకిత భావంతో పనిచేస్తూ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుని అవార్డుతో పాటు, పలు స్వచ్ఛంద సేవా సంస్థలు ద్వారా సేవలందించడం అభినందనీయమన్నారు. ఏపీటీయూ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నేల ప్రవీణ్, అధ్యక్షులు దాసరి థామస్, ఇంజమాల ఆశీర్వాదం, తేర ప్రభాకర్, బి.విద్యాసాగర్, డి.పిలిప్ రాజ్‌కుమార్, అమృత్ నాగార్జున పాల్గొన్నారు.

'అంబేడ్కర్ విగ్రహాన్ని దహనం చేయడం దారుణం'

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): చిత్తూరు జిల్లా వెదురుకుప్పంలో రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని దహనం చేయడం దారుణమని, రాష్ట్ర ఎస్సీ సెల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పాతూరి అంబేడ్కర్, జిల్లా ఎస్సీ సెల్ నాయకుడు బొబ్బర రాజ్‌పాల్ కుమార్ అన్నారు. గురువారం పట్టణ టీడీపీ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిషోర్ అధ్యక్షతన టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు మాట్లాడుతూ వైసీపీ నాయకులే రాష్ట్రంలో అల్లర్లు సృష్టించాలని అంబేద్కర్ విగ్రహంపై దాడి చేశారన్నారు. తోట కృపావరం, వెంపల రాజు, వసంతాటి మంగరాజు, తానిగడప సుమలత, మద్దిపాటి ఉదయ్, నిట్టా రామ్, దోసూరి సుబ్బారావు పాల్గొన్నారు.

మాండూక్యోపనిషత్ గ్రంథానికి పల్లకీ ఉత్సవం



కోలాటంతో గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

చింతలపూడి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని యర్రంపల్లి, ప్రగడవరం గ్రామాల్లో మాండూక్యోపనిషత్ గ్రంథానికి పల్లకీ ఉత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. సనాతన సంప్రదాయాన్ని అందరికీ అర్థమయ్యేలా రచించిన ఆధ్యాత్మిక గురువు వివేకానంద రాసిన ఈ గ్రంథాన్ని సామాన్యులకు చేరువయ్యేలా గత 25 ఏళ్ల నుంచి ప్రచారం నిర్వహిస్తున్నట్టు కార్యకర్తలు పేర్కొన్నారు. ప్రగడవరం, యర్రంపల్లి గ్రామాల్లో పల్లకీ మీద ఊరేగిస్తూ కోలాట ప్రదర్శన జరిపారు. ప్రగడవరంలో చిలుకూరి శ్యామల సౌజన్యంతో ఈ కార్యక్ర మాన్ని పండుగలా చేశారు. అందంగా అలంకరించిన పల్లకీలో ఈ గ్రంథాన్ని ఉంచి గ్రామ వీధుల్లో ఉత్సవం జరిపారు. ఈ ర్యాలీలో మహిళలు పాల్గొన్నారు.

ఆధార్ సేవలు వినియోగించుకోవాలి

టి.నర్సాపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రజలంతా ఆధార్ సేవలను వినియోగించుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు తెలిపారు వెలగపాడు పంచాయతీ వీరభద్రవరం గ్రామంలో నూతనం ఏర్పాటు చేసిన శాశ్వత ఆధార్ కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన ఆధార్ కేంద్రంలోని అందిస్తున్న సేవలను ప్రజలంతా వినియోగించుకోవాలన్నారు.మల్లుకొండ సొసైటీ చైర్మన్ శీలం సాయివినయ్, సొసైటీ కార్యదర్శి పీవీవీ సత్యనారాయణ, వెలగపాడు సర్పంచ్ నయనారపు జలపాలు, వెలగపాడు టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు జోనుబోయిన బాష, పలువురు నాయకులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు నిత్యావసరాలు అందజేత

ఏలూరు రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ ఉద్యోగులైన అంధులు స్ఫూర్తి సేవా కమిటీ సొసైటీ ఏర్పాటు చేసి దివ్యాంగులకు సేవలందించడం అభినందనీయమని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు ఏలూరు దొండపాడులోని పరివర్తన్ దివ్యాంగుల పాఠశాలకు నిత్యావసరాలు అందజేశారు. స్ఫూర్తి సేవా కమిటీ ప్రెసిడెంట్ దేవరాజు, సెక్రటరీ ఏసురాజు, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల విద్యార్థినులకు వైద్య పరీక్షలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కలెక్టర్ వెట్రిసెల్వి, డీఎంహెచ్‌వో డాక్టర్ అమృతం ఆదేశాల మేరకు గురువారం స్థానిక అమీనాపేటలోని ఎస్సీ, బీసీ హాస్టల్స్ విద్యార్థినులకు సీజనల్ వ్యాధులపై అవగాహన, నివారణకు ముందస్తు చర్యలు, ఆరోగ్య విషయాలపై అవగాహన సదస్సును నిర్వహించినట్టు అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు తెలిపారు. వర్షాకాలంలో జ్వరాలు, దగ్గు, జలుబు, అతిసార వంటి రుగ్మతలను అశ్రద్ధచేయవద్దన్నారు. భోజనానికి ముందు, తర్వాత ప్లేట్లు, కాళ్లచేతులు సబ్బునీటితో శుభ్రపర్చుకోవాలని సూచించారు.

ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల బంద్‌కు సన్నాహాలు

(5వ పేజీ తరువాయి)

వైద్యసేవ ట్రస్టు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్ వెల్లడించారు. జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద ఉచిత వైద్యచికిత్సలందించేందుకు 32 నెట్‌వర్క్ ఆసుపత్రులున్నాయి. ఒకవేళ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో శుక్రవారం నుంచి ఉచిత వైద్యచికిత్సలను నిలిపివేస్తే, నెట్‌వర్క్ హాస్పిటల్స్ జాబితాలో ఉన్నప్పటికీ సమ్మెతో సంబంధం లేకుండా ఏలూరు ఆశ్రం వైద్యకళాశాల ఆసుపత్రి, గుడ్ సమరిటన్ క్యాన్సర్, జనరల్ ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవ కింద వైద్యసేవలను నిబంధనల మేరకు కొనసాగించాల్సి ఉంటుందని వివరించారు. పేషెంట్లను ఆశ్రం, గుడ్ సమరిటన్, ఏలూరు, విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రులకు తరలించేందుకు వీలుగా 108 వాహనాలు, వైద్యమిత్రలను సిద్ధం చేసినట్టు తెలిపారు.

ఇక భోజనం భేష్

(5వ పేజీ తరువాయి)

ఆచరణలోకి వచ్చింది. ప్రస్తుతం దసరా సెలవులు అనంతరం కళాశాలకు వస్తున్న విద్యార్థులకు ఈ ఫౌండేషన్ ద్వారా శాకాహార భోజనాన్ని అందిస్తున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతిరోజూ గుడ్డు, వారానికి ఒకసారి మాంసాహారం అందించాల్సి ఉండగా, సదరు బాధ్యతలను మెప్మాకు గాని లేదా ట్రిపుల్ ఐటీలోనే విద్యార్థుల ఆధ్వర్యంలో నడుస్తున్న స్వచ్ఛంద సేవాసంస్థ అయిన హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థకు అందించాలనే ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఆదివారం జరగనున్న గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ఈ నిర్ణయంపై చర్చించి మాంసాహారం, గుడ్లు విద్యార్థులకు అందించేందుకు చర్యలు చేపట్టనున్నారు.



ఏలూరులో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో అమృతం



భీమడోలులో ఫ్లెక్సీలతో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది



పెదవేగిలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

జీఎస్టీ సంస్కరణలు పేదలకు వరం

మందుల ధరలు తగ్గాయన్న డీఎంహెచ్‌వో అమృతం - అవగాహన కోసం పలు చోట్ల ర్యాలీలు

ఏలూరు అర్బన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వస్తు సేవల పన్ను(జీఎస్టీ 2.0)తగ్గింపుతో సాధారణ మందులు, టెస్టింగ్ కిట్లు, దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలకు ఉపయోగించే మందుల ధరలు 12 నుంచి 5 శాతానికి, ప్రాణాంతక వ్యాధులు/రోగాల నివారణ, నియంత్రణలకు వినియోగించే మందులపై పూర్తిగా జీఎస్టీ ఎత్తివేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ పీజే అమృతం అన్నారు. స్థానిక ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో గురువారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, వాణిజ్య పన్నుల శాఖల ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జీఎస్టీ 2.0 సంస్కరణలతో మందుల ధరలు తగ్గడంతో పాటు, జీవిత బీమా, ఆరోగ్య బీమా పొందడం సులభతరమైందన్నారు. ఆరోగ్య సేవలు చౌకగా అందించడం, బీమా సౌకర్యాన్ని ప్రతీ కుటుంబం పొందేలా చేయడానికి జీఎస్టీ తగ్గింపు ప్రోత్సాహకరంగా ఉందన్నారు. పౌష్టికాహారంపై జీఎస్టీ 5 శాతానికి తగ్గించడం వల్ల వికసిత భారత్, ఆరోగ్యభారత్‌కు ఊతమిస్తుందని వివరించారు. జీఎస్టీ జాయింట్ కమిషనర్ బి.నాగార్జునరావు మాట్లాడుతూ దేశంలో 2017లో ప్రారంభమైన వస్తుసేవల పన్ను విధింపు తాజాగా సంస్కరించిన జీఎస్టీ 2.0 వల్ల ప్రజలకు లాభం చేకూరుతుందన్నారు. ముఖ్యంగా ఆరోగ్య శాఖకు సంబంధించి మందుల ధరలతో పాటు, ఆసుపత్రులు, ల్యాబ్ పరికరాల ధరలు గణనీయంగా తగ్గాయన్నారు. జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ డాక్టర్ శోభ, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వంశీ, డాక్టర్ పద్మావతి, డెమో శ్రీనివాసరావు, ఫార్మసీ షాపుల యాజమానులు, ల్యాబ్‌ల నిర్వాహకులు పాల్గొన్నారు.

● పోలవరం: ప్రతి ఒక్కరూ జీఎస్టీపై అవగాహన పెంచుకోవాలని ఐటీడీఏ పీవో రాములు నాయక్ అన్నారు. గురువారం పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో జీఎస్టీ ధరల సంస్కరణలపై జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ పూనెం రాంబాబు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత పీవో ఆసుపత్రిలో రోగులను పరామర్శించి వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఇన్‌చార్జి ఎంపీడీవో చెరుకూరి శ్రీనివాస్ బాబు, పోలవరం మందుల షాపుల యజమానుల సంఘం అధ్యక్షులు మండవల్లి సుబ్బారావు, సింహాద్రి ప్రసాద్, లక్ష్మణరావు, అప్పారావు, గుప్తా, కార్యదర్శి వై.కొండలరావు పాల్గొన్నారు.

● పెదపాడు: జీఎస్టీ సంస్కరణలతో ధరలు తగ్గి వైద్య చికిత్సల్లో ఊరట లభిస్తోందని పెదపాడు వైద్యాధికారి చక్రధర్ తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జీఎస్టీ తగ్గింపుపై గురువారం గ్రామ ప్రజలకు, రోగులకు అవగాహన కల్పించారు. డాక్టరు చక్రధర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మందులు, ఇతర వైద్యసేవలపై గతంలో ఉన్న జీఎస్టీని తగ్గించడం ద్వారా వైద్య సేవల్లో లబ్ధి కలుగుతుందన్నారు.

● చింతలపూడి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు హయగ్రీవ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు జీఎస్టీ సంస్కరణలపై అవగాహన కల్పించారు. అధ్యాపకులు పి.రాజాబాబు, పి.అచ్చిబాబు, పి.శంకర్ సూచించారు.ఏరియా ఆసుపత్రిలో కూడా జీఎస్టీపై మందుల ధరలపై అవగాహన కల్పిస్తూ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. పట్టణంలోని ఫార్మాసిస్టులు పాల్గొని రోగులకు వివరించారు.

● భీమడోలు: భీమడోలు మండలంలోని పలు ప్రభుత్వ వైద్యశాలలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్ కార్యక్రమంపై అవగాహన ర్యాలీలు నిర్వహించారు. భీమడోలు సామాజిక వైద్య కేంద్రం ఆవరణలో వైద్యులు సునీత ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించగా జిల్లా వైద్య అధికారి పాల్ సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఏఎంసీ చైర్మన్ శేషగిరి, అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు. గుండుగొలను, పూళ్ళ వైద్య కేంద్రాలలో నిర్వహించిన ర్యాలీల్లో వైద్యులు భార్గవి, ఇందిర జ్యోతి సిబ్బంది పాల్గొన్నారు.

● పెదవేగి: జీఎస్టీ తగ్గింపుతో అన్నివర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని పెదవేగి ఎంపీడీవో రవికుమార్ అన్నారు. జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించడానికి అనువుగా పెదవేగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం(పీహెచ్‌సీ)లో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో రవికుమార్ మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో మందుల కొనుగోలులో ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. జీఎస్టీ తగ్గింపుపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేసి, వివరించాలని సూచించారు. గ్రామ కార్యదర్శి కె.వి.ప్రసాద్, ఏఎన్ఎం పద్మ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

● ఏలూరు క్రైం: ఏలూరు జిల్లాలోని జిల్లా ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం జీఎస్టీపై వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ నాగార్జునరావు అధ్యక్షతన ఆసుపత్రుల ప్రతినిధులు, ఫార్మసీ ఏజెన్సీస్, బీమా ప్రతినిధులతో అవగాహన జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ పిజె అమృతం మాట్లాడుతూ ప్రాణాధార ఔషధాలు, జీవిత, ఆరోగ్య బీమాలపై పూర్తిస్థాయిలో జీఎస్టీ తొలగించారన్నారు. ప్రతీ ఒక్కరూ ఆరోగ్య బీమా తీసుకోవాలన్నారు. సాధారణ మందులు, టెస్టింగ్ కిట్లపై జీఎస్టీ 5 శాతానికి తగ్గిందని తెలిపారు.

ముగిసిన మండల స్థాయి ఎంపికలు


ఏలూరురూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీల ఎంపికలు గురువారం ముగిశాయి. రెండో రోజు ఏలూరు ఇండోర్ క్రీడా మైదానంలో అథ్లెటిక్స్, లాంగ్ జంప్, షార్ట్‌పుట్, జావిలిన్ త్రో, డిస్కస్ త్రో పోటీలు నిర్వహించారు. మొదటి రోజు శనివారపుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో బాల బాలికల క్రీడా పోటీలకు ఏలూరు రూరల్, అర్బన్ పాఠశాలల నుంచి అండర్-14, 17 విభాగంలో వాలీబాల్, కబడ్డీ, యోగా, షటిల్ ఎంపికలు జరిగాయి. రెండవ రోజు 700 మంది ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఎంపికైన క్రీడాకారులు డివిజన్ స్థాయిలో పాల్గొంటారు. ఎస్జీఎఫ్ మండల కన్వీనర్ పద్మలత పర్యవేక్షించారు. ఆయా పాఠశాల పీఈటీలు, పీడీలు పాల్గొన్నారు.

జీవన జ్యోతి బీమా సొమ్ము అందజేత

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం ద్వారా సహజ మరణానికి మంజూరైన రూ.రెండు లక్షల బీమా సొమ్మును స్థానిక ఎస్‌బీఐ టౌన్ బ్రాంచ్ మేనేజర్ పి.ఆర్.సతీశ్ కుమార్ గురువారం లబ్ధిదారులకు అందజేశారు. పట్టణానికి చెందిన పాడిశెట్టి పద్మజ శ్రీనివాస్ ఎస్.బి.ఐ సేవింగ్స్ అకౌంట్ ద్వారా ప్రధాన మంత్రి జీవనజ్యోతి బీమా యోజన పథకం నిమిత్తం ఇటీవల పద్మజ శ్రీనివాస్ ఆకస్మికంగా మృతి చెందగా అతని భార్య పాడిశెట్టి ఉమాకు రూ.రెండు లక్షల బీమా సొమ్మును అందచేసినట్టు బ్యాంకు మేనేజర్ తెలిపారు. ఖాతాదారులంతా తప్పనిసరిగా ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకంపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఫీల్డ్ ఆఫీసర్ కోటేశ్వరరావు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన అవసరం

ద్వారకాతిరుమల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మానసిక ఆరోగ్యంపై విద్యార్థులు అవగాహన పెంచుకోవడంతో పాటు ఓ లక్ష్యంతో విద్యను అభ్యసించాలని జిల్లా మానసిక కౌన్సిలర్ ఎం.సుధీర్ కుమార్ సూచించారు. మండలంలోని తిరుమలంపాలెం జడ్పీహెచ్ పాఠశాలలో వరల్డ్ మెంటల్ హెల్త్ వీక్‌లో భాగంగా విద్యార్థులకు అవగాహన సదస్సు జరిగింది. ఇందులో సమగ్ర శిక్ష అభియన్ నుంచి పాల్గొన్న సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు వినూత్నంగా ఆలోచించడం అలవాటు చేసుకోవాలన్నారు. తమ భావోద్వేగాలను అదుపులో ఉంచుకుంటూ సత్ప్రవర్తనను అలవర్చుకోవాలన్నారు. సహ హెచ్ఎం యు.ఫణికుమార్ పాల్గొన్నారు.



కిట్లను అందజేస్తున్న అధికారులు

హస్త కళలపై అవగాహన

బుట్టాయగూడెం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): భారతీయ హస్త కళలపై విద్యార్థులందరకీ అవగాహన కల్పిస్తున్నట్టు డెవలప్‌మెంట్ కమిషనర్ కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ సహాయ డెరెక్టర్ ఎన్.అపర్ణలక్ష్మీ తెలిపారు. గురువారం బూసరాజుపల్లి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో డవలప్‌మెంట్ కమిషనేర్ కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ ఆర్థిక సహకారంతో కోకో ట్రైబల్ ప్రొడ్యూసర్ కంపెనీవారి నిర్వాహణలో నైపుణ్యాభివృద్ధి, వెదురుతో తయారు చేసిన వస్తువుల ప్రదర్శనా కార్యక్రమం చేపట్టారు. సహాయ డైరెక్టర్ మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే హస్త కళలపై అవగాహన పెంచుకుని వస్తువుల తయారీలో నైపుణ్యం సాధించాలన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, వెలుగు డీపీఎం పార్థసారథి, ఏపీడీ రాజరాబు, షేడ్ పీడీ సుధీర్ కుమార్, ప్రిన్సిపాల్ సుభాషిణి పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న చింతమనేని

ఆధ్యాత్మిక భావన పెంపొందాలి

పెదపాడు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరిలోనూ ఆధ్యాత్మిక భావనలు పెంపొందాలని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదపాడులో తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ లావేటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వాములకు ఏర్పాటు చేసిన అన్నదానాన్ని ఎమ్మెల్యే ప్రభాకర్ గురువారం ప్రారంభించి వడ్డించారు. ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ గ్రామాల్లో అయ్యప్ప, భవానీ, శివ, గోవింద స్వాముల మాలధారణ కార్యక్రమం ప్రతి ఏటా పెరుగుతోందని, వారికి ఇబ్బందులు లేకుండా అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. అనంతరం తొలిరోజు అన్నదానానికి ఆర్థికసహకారాన్ని ఎమ్మెల్యే ప్రభాకర్ అందజేశారు.గారపాటి రామసీత,ఉప్పలపాటి రాంప్రసాద్, గుత్తా అనిల్, బొప్పూడి కాశీబాబు, ఎం.రవి, వీరాంజనేయులు పాల్గొన్నారు.

లో గ్రేడ్ పొగాకు కిలోకు రూ.300 ఇవ్వాలి

బుట్టాయగూడెం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): లో గ్రేడ్ వర్జీనియా పొగాకు కిలోకు రూ.300 ధర కల్పించాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుట్టాయగూడెంలో ప్రజా సంఘాల కార్యాలయంలో గురువారం వెట్టి వీరయ్య అధ్యక్షతన జరిగిన మండల మహాసభలో పాల్గొని మాట్లాడారు.పత్తి, మొక్కజొన్న అపరాల పంటలను ఆదుకోవాలన్నారు. లో గ్రేడ్ పొగాకు రూ.100 లోపు ధర పలకడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. దళారుల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని, మండలంలోని చెరువులను బాగుచేసి ఆయకట్టుకు సాగునీటిని అందించాలన్నారు. అనంతరం మండల రైతు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు.అధ్యక్ష, కార్యదర్శులుగా వెట్టి వీరయ్య, కోర్స జలపాలు, ఉపాధ్యక్షుడిగా నల్లజర్ల ఆనంద్, సహాయ కార్యదర్శిగా చీమల రాజు, మరో 9 మందితో కమిటీ ఎన్నిక జరిగింది.

బోధనేతర పనులు తగ్గించాలి

ఏలూరు రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మితిమీరిన బోధనేతర కార్యక్రమాల వల్ల ఉపాధ్యాయులపై అనవసర భారం పెరిగి బోధన కుంటుపడుతోందని ఏలూరు రూరల్ మండల ఫ్యాప్టో నాయకులు నంబూరి రాంబాబు అన్నారు. ఈ మేరకు గురువారం మండల విద్యాశాఖ అధికారిని కలిసి నాయకులు వినతిపత్రం అందజేశారు. ఫ్యాప్టో ఇచ్చిన పిలుపు మేరకు, శుక్రవారం నుంచి ఉపాధ్యాయుల విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజన నిర్వహణ తప్ప మిగిలిన బోధనేతర కార్యక్రమాలను బహిష్కరిస్తున్నట్టు పేర్కొన్నారు. నాయకులు జేసుదాస్, డి.శ్రీనివాసరావు, టి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు మానవత సాయం

కామవరపుకోట, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన విద్యార్థులకు కామవరపుకోట మండలం తడికలపూడి గ్రామంలో ఆలిండియా జెఈఈ మెయిన్స్‌లో 2004 ర్యాంకు సాధించిన గుడివాడ వినీత శ్రీసాయి లలితకు మానవత సంస్థ ద్వారా రూ.25వేల ఆర్థిక సహాయాన్ని గురువారం అందజేశారు. గోపన్నపాలెం కేంద్రీయ విద్యాలయ సెంట్రల్ గవర్నమెంట్ స్కూల్లో చదువుతున్న సాగిపాడు గ్రామానికి చెందిన పర్సా నిశాంత్‌కు రూ.ఐదు వేల సహయాన్ని సొసైటీ చైర్మన్ తూతా బాలాజీకుమార్ అందజేశారు. మానవత గౌరవ డైరెక్టర్ మద్ది సుధాకరరావు, కుమారుడు హరికృష్ణలు 30 వేల రూపాయల నగదు ప్రోత్సాహాన్ని అందజేశారు. విద్యార్థుల తల్లిదండ్రులు, మానవత సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చంటి

రాజకీయాలకతీతంగా అమ్మవార్ల జాతర

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పార్టీలకు అతీతంగా, వివాదాలకు తావులేకుండా ఏలూరు పవరుపేటలోని గంగానమ్మ, ఆదిమహాలక్ష్మమ్మ, వినుకొండ అంకమ్మ, పోతురాజుబాబుల జాతరను విజయవంతం చేయాలని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి సూచించారు. ఇందుకు సంబంధించిన ప్లకార్డులు, బ్రోచర్లను ఆర్టీసీ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఏఎంసీ చైర్మన్ మామిళ్ళపల్లి పార్థసారథిలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నవంబరు 9న అమ్మవార్లకు ముడుపు కట్టి పందిరి రాటా స్థాపనకు శ్రీకారం చుడతారని, 2026 జనవరి 26వ తేదీ వరకు జారత జరుగుతుందని ఎమ్మెల్యే చంటి, అప్పలనాయుడు, పార్థసారథిలు ప్రకటించారు. కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, టీడీపీ నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కొలువల కమిటీ గౌరవాధ్యక్షులు బడేటి వెంకట్రామయ్య, బంకా ప్రసాద్, కార్యదర్శి కేశవరావు, వీరాస్వామి, కోశాధికారి జవ్వాజి మోహన్ విఠల్, ఆర్గనైజింగ్ కార్యదర్శి రవికుమార్ శర్మ, నౌడూరి వాసు, అలగంజి లక్ష్మీ పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

రేచర్లలో గ్రామస్థుల ఆందోళన

చింతలపూడి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): గుడిలో రాముడి విగ్రహం తొలగించి ఆ స్థానంలో గుంత తవ్వి మట్టి పోశారంటూ రేచర్లలో గ్రామస్థులు గురువారం ఆందోళన నిర్వహించారు. గుడిలో రాముని విగ్రహాలను తొలగించిన వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ రోడ్డుపై బైఠాయించారు. 1990లో దాత స్థలం ఇస్తే గుడిని నిర్మించుకున్నామని, ఇప్పుడు అది తన స్థలమంటూ ఓ వ్యక్తి రాముడి విగ్రహాలు తొలగించి ఎక్కడో పడేశారని ఆరోపించారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు.ఎస్ఐ కుమార్ మాట్లాడుతూ దీనిపై దర్యాప్తు చేస్తున్నామన్నారు.



సమావేశంలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్ బ్రహ్మరాజు

మార్కెట్ యార్డును అభివృద్ధి చేస్తాం

ద్వారకాతిరుమల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మార్కెట్ యార్డును ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు సహకారంతో రైతుల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తామని ఏఎంసీ చైర్మన్ వై.బ్రహ్మరాజు అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులో గోపాలపురం ఏఎంసీ కార్యవర్గ సమావేశం ఆయన అధ్యక్షతన గురువారం జరిగింది.మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న నిమ్మకాయల క్రయవిక్రయాలకు సంబంధించి పలు అంశాలు, కమిషన్ వ్యాపారులు మార్కెటింగ్ సిబ్బంది లేవనెత్తిన అంశాలను పరిశీలించి పలు తీర్మానాలు చేశారు. ఏఎంసీ వైస్ చైర్మన్ ధర్మరాజు,స్థానిక సొసైటీ అధ్యక్షుడు పోలిన శ్రీనివాసరావు, రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ లంకా సత్యనారాయణ, నాదెళ్ల వెంకటేశ్వరరావు, ఏపూరి కిషోర్, కూనపాం ప్రసాద్, యలమంచిలి బాబీ, ఘంటా శ్రీనివాసరావు, జంగా కృష్ణమూర్తి బొట్ల సాయి, ఏఎంసీ అధికారులు పాల్గొన్నారు.



రికార్డులు తనిఖీ చేస్తున్న శ్రీనివాస్

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం తనిఖీ

భీమడోలు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): భీమడోలు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని జిల్లా సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాస్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. కార్యాలయంలో అధికారులు రోజువారి విధుల నిర్వహణపై ఆరా తీశారు. అలాగే కార్యాలయంలో పలు రికార్డులను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం రిజిస్ట్రేషన్ సేవలను వినియోగించుకునేందుకు వచ్చిన కక్షిదారులతో ముఖాముఖి నిర్వహించారు. కార్యాలయంలో ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అలాగే స్థానికంగా ఉన్న దస్తావేజు లేఖర్లతో ఆయన మాట్లాడారు. సబ్ రిజిస్ట్రార్ రాఘవేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పంటకోత ప్రయోగంపై అవగాహన

దెందులూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):పంట కోత ప్రయోగాలపై అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని రైతులకు ఇబ్బందులు కలిగించకుండా ప్రయోగాలు చేయాలని పంట కోత ప్రయోగాల పర్యవేక్షణ ఎస్‌వో కె.దాస్ అన్నారు. గురువారం దెందులూరులోని రైతు సేవ కేంద్రంలో మండలంలోని వ్యవసాయ శాఖ మండల అధికారి ఎల్.శ్రీనివాస్ రాజు ఆధ్వర్యంలో అధికారులకు పంట కోత ప్రయోగాలు చేసే విధానంపై అవగాహన కల్పించారు. మండలంలోని వ్యవసాయ శాఖ గ్రామ అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

డ్యాన్స్ షోకు ఆర్థిక సాయం

కుక్కునూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల ప్రతిభను వెలుగులోకి తీసుకొచ్చే ఉద్దేశంతో నిర్వహించే దివ్యాంగుల సూపర్ టాలెంట్ డ్యాన్స్ షో నిర్వహణకు పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, చిర్రి ఛారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.20 వేల ఆర్థిక సాయం అందించారు. కుక్కునూరుకు చెందిన డ్యాన్స్ మాస్టర్ నాగేశ్వరరావు సుప్రీం సినిమా ద్వారా పేరు సంపాదించాడు. ఈ నెల 19న ఆదివారం కుక్కునూరు మండలం మారేడుబాకలో డ్యాన్స్‌షో నిర్వహించనున్నారు. ఈ క్రమంలో నాగేశ్వరరావు ఆహ్వానం మేరకు డ్యాన్స్ షోకు ఆహ్వానం పలికారు. దివ్యాంగుల ప్రతిభకు తోడుగా నిలిచే ఇటువంటి కార్యక్రమాలకు సామాజిక బాధ్యతగా అండగా ఉంటానని ఎమ్మెల్యే తెలిపారు. అనంతరం దివ్యాంగుడైన నాగేశ్వరరావును శాలువాతో ఘనంగా సన్మానించారు.

యువతకు చెగువేరా రోల్‌మోడల్

కుక్కునూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):యువతకు రోల్‌మోడల్ చెగువేర నిలిచారని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి అన్నారు. గురువారం చెగువేర 58వ వర్ధంతిని సీఐటీయూ వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముడియం నాగమణి, వై.సాయికిరణ్, బుయ్యన శ్రీను, లక్ష్మయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ కాటా ప్రారంభం

టి.నర్సాపురం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ రైతుల సౌకర్యం కోసం నూతన కాటా ఏర్పాటు చేసినట్టు నవభారత్ కంపెనీ డీజీఎం రాజగోపాల్ తెలిపారు. మర్రిగూడెంలో నవభారత్ కంపెనీ ఆధ్వర్యంలో రూ.కోటితో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయిల్‌పామ్ కాటాను గురువారం జంగారెడ్డిగూడెం జోన్ రైతు సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆచంట సూర్యనారాయణ ప్రారంభించారు. మర్రిగూడెం, మక్కినవారిగూడెం, బండివారిగూడెం పంచాయతీల్లోని రైతులకు ఈ కాటాతో మేలు జరుగుతుందని తెలిపారు. జంగారెడ్డిగూడెం నవభారత్ ఆయిల్ పామ్ రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు, మక్కినవారిగూడెం సొసైటీ చైర్మన్ ఆచంట సూర్యనారాయణ, గెడా శ్రీధర్, ఆలపాటి పాపారావు, పిన్నమనేని రాము, కొత్తా రామారావు, పూనెం ఆదిత్య, బలుసు వేణు పాల్గొన్నారు.

డాక్టర్ల సమస్యలు పరిష్కరించాలి

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పీహెచ్‌సీలో పనిచేస్తున్న రెగ్యులర్ డాక్టర్ల సమస్యలు పరిష్కరించాలని, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్య ఆరోగ్య సేవలు కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా పిహెచ్‌సీల్లో పనిచేస్తున్న 2 వేల 800 మంది డాక్టర్లు వారం రోజులుగా తమ సమస్యలు పరిష్కరించమని కోరుతూ సమ్మె చేస్తున్నారని, నాలుగు రోజులుగా విజయవాడలో దీక్షలు చేస్తున్నారని తెలిపారు. వెంటనే డాక్టర్ల యూనియన్‌లతో చర్చలు జరిపి సమ్మెను విరమింపజేయాలని రవి కోరారు.

విద్యార్థి నాయకుడు శ్రీనివాస్‌కు ఏయూ డాక్టరేట్ ప్రదానం



ఏలూరు రూరల్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ (బి.ఎస్.ఎఫ్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కొండపల్లి శ్రీనివాస్‌కు ఆంధ్రాయూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆంధ్రా యూనివర్సిటీలోని రాజనీతి శాస్త్ర, ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ పేటేటి ప్రేమానందం గైడెన్స్‌లో పి.హెచ్.డి. పరిశోధన పూర్తి చేశారు. రాజనీతి శాస్త్రంలో పొలిటికల్ అవేర్నెస్ అమాంగ్ షెడ్యూల్డ్ క్యాస్ట్స్ ఇన్ ఏపీ - ఎ కేస్ స్టడీ ఫోకసింగ్ ఆన్ వెస్ట్ గోదావరి డిస్ట్రిక్ట్) అనే అంశంపై పీ.హెచ్.డి పూర్తి చేసినందుకు ఆంధ్రాయూనివర్సిటీ డాక్టరేట్ అవార్డును ప్రదానం చేసిందని తెలిపారు. ఆ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జీపీ రాజశేఖర్ చేతుల మీదుగా డాక్టరేట్ స్వీకరించారు.

'మండవల్లిలో సమస్యలు పరిష్కరించండి'

మండవల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ శ్మశాన వాటికలో జంగిల్ క్లియరెన్స్ చేయాలని, అగ్రహారం రోడ్డు రెండు వైపులా కల్వ ర్రైయిన్ తీయాలని, ఎస్సీ ఏరియాలో సీసీ రోడ్డు వల్లంగా ఉన్న రోడ్డు మెరక చేయించాలని పలువురు అర్జీలు అందించారు. గురువారం మండవల్లి గ్రామ పంచాయతీ సర్పంచ్ మెండా యూస్సీ అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, నాయకులు గుడివాడ చిట్టిబాబు, ముళ్లపూడి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్త్రీశక్తి పథకాన్ని 6.19 లక్షల మంది మహిళల వినియోగం

నూజివీడు టౌన్, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):నూజివీడు ఆర్టీసీ బస్ డిపో ద్వారా స్త్రీశక్తి పథకంలో ఉచిత బస్సు ప్రయాణాన్ని 6,19,020 మంది మహిళలు సద్వినియోగం చేసుకు న్నారని డిపో మేనేజరు పి.దానాంజనేయులు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా 3.09 కోట్లు మేర వారికి లబ్ధి చేకూరడంతో పాటు రీయంబర్స్‌మెంట్ ద్వారా ఆర్టీసీ డిపోకు ఆదాయం లభించే అవకాశం ఉందన్నారు. మరిన్ని మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు ఆయన తెలిపారు.

పేదలకు మెరుగైన వైద్యమే లక్ష్యం : మంత్రి సారథి

ఆగిరిపల్లి, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి):పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గురువారం ఆగిరిపల్లి బస్‌స్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో సీఎం సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు ఆయన పంపిణీ చేశారు. నియోజకవర్గంలో 68 మంది కుటుంబాలకు సుమారు రూ.36 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గతంలో వైద్యం చేయించుకున్న వారు ఆ బిల్లులను పార్టీ కార్యాలయంలో అందజేస్తే సీఎం సహాయ నిధి నుంచి ఆర్థిక సాయం అందిస్తానన్నారు. ఎంపీడీవో భార్గవి, తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్.వేణు, చిన్నిని శివరామకృష్ణ, మడుపల్లి గోపాల్, ఆరేపల్లి శ్రీనివాసరావు, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ముసునూరులో సమస్యలు పరిష్కరిస్తాం'

ముసునూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి):ముసునూరులో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి పార్థసారథి అన్నారు. గురువారం గ్రామ పెద్దలు, టీడీపీ నాయకులు, యువకులు సంయుక్తంగా మంత్రిని కలిసి సమస్యలను వివరించారు. శ్మశాన వాటికలో కనీస మౌలిక సదుపాయాలు లేవని, ఐటీఐ నూతనంగా ఎంపీటీసీ నిధులతో వేసిన మంచినీటి బోరుకు విద్యుత్ కనెక్షన్ ఇప్పించాలని, తదితర సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. వీటిపై మంత్రి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. వివిధ వారీగా నిధులను కేటాయించేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ఐటీఐ జడ్పీ నుంచి యాదవ కమ్యూనిటీ హాలు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు చేసిన సందర్భంగా నాయకులు, పెద్దలు, యువకులు మంత్రిని సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. సర్పంచ్ తనయుడు కొండేటి బాబీ, ఉప సర్పంచ్ తోట శ్రీనివాసరావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు సొంత నగదు అందిస్తున్న ఎమ్మెల్యే కామినేని

పారిశుధ్య కార్మికులకు రూ.8.10 లక్షలు అందజేత

కైకలూరు,అక్టోబరు9 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికుల జీతాలు త్వరితగతిన అందించేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ అన్నారు. గురువారం కైకలూరు క్యాంపు కార్యాలయంలో కైకలూరు గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న 81 కార్మికులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున రూ.8లక్షల 10వేలను ఆయన సొంతంగా అందజేశారు. కైకలూరు పంచాయతీలో ఎనిమిది నెలలుగా కార్మికులకు జీతాలు ఇవ్వకపోవడంతో వారు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారని ఎమ్మెల్యే సొంతంగా ఈ నగదును అంద జేశారు. వచ్చే దీపావళి పండుగను సంతోషంగా గడుపుకోవాలని ఆకాంక్షించారు.

ముంపు నివారణ చర్యలు చేపట్టాం..

కైకలూరు వెలమపేటలో ఎంజీఎంఆర్ఈజీఎస్ నిధులతో నిర్మాణం చేసిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ గురువారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ డ్రెయిన్ల ప్రక్షాళనతో వెలమపేట కాలనీ ముంపును గురికాకుండా చేశామని, అలాగే ప్రధానరహదారిని నిర్మాణం చేయడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా జరిగాయన్నారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు, ఎంపీపీ అడవికృష్ణ, సర్పంచ్ నవీన్ కుమార్, కేవీఎన్.ఎం. నాయుడు, మాజీ ఎంపీపీ నర్సిపల్లి అప్పారావు, టీడీపీ మండల అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, వైస్ ఎంపీపీ మంగినేని రామకృష్ణ, పూల రామచంద్రరావు, వేములపల్లి కాటయ్య, సత్తిరెడ్డి సురేష్, తదితరులు పాల్గొన్నారు.

పెయ్యేరులో చౌక డిపో ఏర్పాటుపై చర్యలు

ముదినేపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి మండలం పెయ్యేరు గ్రామ పంచాయతీ ఏరియాలోని ప్రజలకు చౌక డిపో అందుబాటులో ఉండేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ ఆసిఫ్ పాషా తెలిపారు. ప్రస్తుతం చౌక డిపో ఉన్న ప్రాంతం పెయ్యేరు ప్రజలకు దూరంగా ఉందని ఆ గ్రామస్థులు అందజేసిన వినతులను పరిశీలించి రిపోర్టు ఇవ్వాలని సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్‌ను ఆదేశించినట్టు తెలిపారు. ఆ పంచాయతీ ఏరియా విస్తీర్ణం పెద్దదిగా ఉన్నందున చౌక డిపో ద్వారా బియ్యం, ఇతర నిత్యావసర వస్తువులు తీసుకునేందుకు వినియోగదారులందరికీ అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేస్తామన్నారు. ప్రస్తుతం చౌకడిపో ఉన్న ప్రదేశం తోపాటు, పెయ్యేరు, వైఎస్ఆర్ కాలనీ, అప్పారావుపేట గ్రామాల్లో బియ్యం ఇచ్చేందుకు కొన్ని రోజులు కేటాయించేలా పరిశీలిస్తున్నట్టు తహసీల్దార్ తెలిపారు.

సెయింట్ థామస్‌లో మండల స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

నూజివీడు టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి):నూజివీడు మండలస్థాయి అథ్లెటిక్స్ పోటీలను సెయింట్ థామస్ హైస్కూల్లో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడా పోటీలను బాలికోన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్ఎం దగ్గు శ్రీనివాసరావు, రెవరెండ్ బ్రదర్ కిషోర్‌కుమార్, బ్రదర్ జార్జిరెడ్డి పర్యవేక్షించగా సీనియర్ డివిజన్లో సెయింట్ జోసెఫ్, సెయింట్‌థామస్, ఎస్.ఆర్.ఆర్ బాలుర పాఠశాలలు వరుసగా మూడుస్థానాలు దక్కించుకోగా జూనియర్ డివిజన్లో యనమదల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్. ఆర్.ఆర్ బాయిస్, సెయింట్ మేరీస్‌లు వరుసగా మూడుస్థానాల్లో నిలిచాయి.



ఆగిరిపల్లిలో జీఎస్టీపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న మంత్రి పార్థసారథి



కైకలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు జీఎస్టీపై అవగాహన కల్పిస్తున్న శ్రీనివాసరావు



కలిదిండిలో అవగాహన కల్పిస్తున్న మెడికల్ అసోసియేషన్ సభ్యులు

జీఎస్టీ తగ్గింపుతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు మేలు

» రాష్ట్ర మంత్రి పార్థసారథి

ఆగిరిపల్లి/నూజివీడు/చాట్రాయి/ముసునూరు/కైకలూరు/కలిదిండి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపు వల్ల పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఎంతో మేలు చేకూరుతుందని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గురువారం ఆగిరిపల్లిలో జీఎస్టీపై అవగాహన ర్యాలీని ఎస్‌బీఐ నుంచి బస్టాండ్ వరకు నిర్వహించారు. కిరాణా, మెడికల్ షాపు వ్యాపా రస్తులతో మాట్లాడి జీఎస్టీ తగ్గింపుపై అవగాహన కల్పించారు. అనంతరం ఆగిరిపల్లి బస్టాండ్ వద్ద ఏర్పాటు చేసిన 'సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. సూపర్ జీఎస్టీ తగ్గింపు ద్వారా సామాన్యులకు మరింత డబ్బు ఆదా అవుతుందన్నారు. జీఎస్టీ సంస్కరణలు దేశాభి వృద్ధికి, సామాన్యుల ఆర్థిక అభివృద్ధికి దోహదపడతాయని, తద్వారా విజన్ 2047 సాకారం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలు ప్రజలకు పూర్తిగా అందాలంటే, వ్యాపార వర్గా లు సహకరించాలని కోరారు. ఎంపీడీవో భార్గవి, తహసీల్దార్ పీఎస్‌వీ ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు ఎన్.వేణు, చిన్నిని శివరామకృష్ణ, మడుపల్లి గోపాల్, ఆరేపల్లి శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

● నూజివీడు ఏరియా ఆసుపత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజారాణి ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్‌సేవింగ్స్ కార్యక్రమంపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఆసుపత్రిలోని రోగు లు, ఇతర సిబ్బందికి జీఎస్టీపై అవగా హన కార్యక్రమం నిర్వహించారు. ఏరియా ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ కీర్తి, జీఎస్టీ నోడల్ ఆఫీసర్ అజయ్, డాక్టర్ గోపి పాల్గొన్నారు. దిగవల్లి పీహెచ్‌సీలోనూ జీఎస్టీపై ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ సాయి కృష్ణ, సీహెచ్‌వో యూస్సీరాణి పాల్గొన్నారు

● సూపర్ జీఎస్టీ ప్రయోజనాలను అన్ని వర్గాల ప్రజలు అవగాహనతో ఉపయోగించు కోవాలని నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న కోరారు. చాట్రాయి పీహెచ్‌సీలో గురువారం జరిగిన సూపర్ జీఎస్టీ అవగాహన సమావే శంలో ఆమె మాట్లాడారు. ఈ విధానంలో వస్తువులపై పన్నుల భారం తగ్గి ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విజయలక్ష్మి, ఇన్‌ఛార్జి ఎంపీడీవో విజయలక్ష్మి వైద్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

● సూపర్ జీఎస్టీని సద్వినియోగం చేసు కోవాలని ముసునూరు సర్పంచ్ కొండేటి విజయలక్ష్మి యర్రియా, ఎంపీడీవో పిల్లి ఏసు బాబు అన్నారు. గురువారం ముసునూరు, రమణక్కపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో జీఎస్టీపై అవగాహన కార్యక్రమం నిర్వహిం చారు. ముసునూరు మండల కెమిస్ట్ అసోసి యేషన్ అధ్యక్షుడు ఎం.వంశీకృష్ణ, డాక్టర్ గంగాధరరావు, సీహెచ్ఎస్ కుమారి, ఎంపీ హెచ్ఎస్ మురళీమోహన్, హెల్త్ సూపర్ వైజర్ కర్రి కృష్ణారావు, మెడికల్ దుకాణాల యజమానులు, నాయకులు పాల్గొన్నారు.

● జీఎస్టీని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కైకలూరు సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ ఎ.శ్రీనివాసరావు అన్నారు. గురువారం కైకలూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు జీఎస్టీపై అవగా హన కల్పించి ర్యాలీ నిర్వహించారు. అనేక రకాల మందులపై 5 శాతానికి జీఎస్టీని తగ్గించారని, వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆసుపత్రిలోని వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

● కలిదిండి పీహెచ్‌సీలో గురువారం సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌పై మెడికల్ అసోసియేషన్ సభ్యులు అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్రం ప్రజా సంక్షేమ దృష్ట్యా మందులపై జీఎస్టీ 18 శాతం నుంచి 5 శాతానికి తగ్గించం దన్నా రు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో వాలన్నారు. మెడికల్ అసోసియేషన్ సభ్యులు నీలి దుర్గావెంకటసత్యనారాయణ, పూల హనుమంతరావు, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ కృష్ణకిషోర్, బీజేపీ నాయకులు కొరా శ్రీనివాస్, ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీహరిపురంలో ఊయల ఊగుతున్న మహిళ.. గౌరీదేవి పూజలు

వేడుకగా అట్లతద్ది పండుగ

ముదినేపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ముదినేపల్లి ప్రాంత ప్రజలు గురువారం అట్లతద్ది పండుగను సంప్రదాయ సిద్ధంగా జరుపుకున్నారు. కొత్తగా వివాహమైన వారితో పాటు పలువురు మహిళలు వాయినాలు తీర్చుకుని, గృహాలు, పంట కాల్వల వద్ద గౌరీదేవి పూజలు నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం అట్లుపోసి ముత్తైదువులకు వాయినాలు అందజేశారు. మహిళలు ఊయల ఊగడం, పలు ఆటలతో గ్రామాల్లో కోలాహలంగా కనిపించాయి.

'క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలి'

ఆగిరిపల్లి, అక్టోబరు9(ఆంధ్రజ్యోతి): భావి భారత పౌరులుగా విద్యార్థులు ఎదగాలంటే క్రమశిక్షణతో కూడిన విద్యను అందించాలని ఏపీ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ డైరెక్టర్ వీఎన్ మస్తానయ్య అన్నారు. మెగా డీఎస్సీ 2025లో ఎంపికైన నూతన ఉపాధ్యాయులకు శిక్షణలో భాగంగా ఈదరలోని ఏపీ రెసిడెన్షియల్ హైస్కూల్లో జరుగుతున్న ఉపాధ్యాయుల శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. సంప్రదాయ బోధన కంటే కృత్యాధార బోధన విద్యార్థులపై ఎంతో ప్రభావం చూపిస్తుందని, ఎక్కువ శాతం గుర్తుం టుందన్నారు. డాక్టర్ రవి అరుణ, శ్రీమన్నారాయణ, విజయ్‌కుమార్, ఏఎంవో రెడ్డి రామారావు, రవీంద్ర ప్రసాద్, భాస్కర్‌కుమార్, ఎంఈ వోలు ఆనంద్‌కుమార్, బీఈఎస్ సుబ్బారావు, రిసోర్స్‌పర్సన్లు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

బస్సు ఢీకొని డిగ్రీ విద్యార్థి మృతి

ఆగిరిపల్లి, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి):బస్సు ఢీకొని డిగ్రీ విద్యార్థి మృతి చెందిన ఘటన ఆగిరిపల్లిలోని హరిజనవాడ సమీపంలో గురువారం రాత్రి జరిగింది. ఎస్ఐ శుభశేఖర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఆగిరిపల్లి మండలం రావులపాలెం గొల్లగూడెంకు చెందిన పఠాపంచల సాయి(19) ద్విచక్రవాహనంపై ఆగిరిపల్లి నుంచి విజ యవాడకు వెళ్తుండగా నూజివీడు నుంచి విజయవాడ వెళ్తున్న బస్సు వెనుక నుంచి బైక్‌ను ఢీకొనడంతో సాయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతి చెందిన యువకుడు డిగ్రీ చదువుతున్నట్టు తెలిసింది. సమా చారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. మృతుని కుటుంబ సభ్యులకు విషయం తెలిపి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

ముదినేపల్లి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రొయ్యల చెరువుపై విద్యుత్ మోటారును బాగు చేస్తుండగా ఓ వ్యక్తి విద్యుత్‌షాక్‌కు గురై అక్కడి క్కడే మరణించిన ఘటన బొమ్మినంపాడులో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామంలోని బి.బాలకృష్ణకు చెందిన రొయ్యల చెరువుపై ఉండి మండలం గోరింతాడ గ్రామానికి చెందిన ఒబిలిశెట్టి ఏసురాజు(35) కొంతకాలంగా పని చేస్తున్నాడు. చెరువు గట్టుపైనే మకాం ఉంటున్నాడు. గురువారం ఉదయం చెరువు నీళ్లు తోడుతుం డగా విద్యుత్ మోటారు ఆగిపోయింది. మోటారును బయటకు తీస్తుండగా విద్యుత్ షాక్ తగిలి అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. దీనిపై చెరువు యజమాని మృతుడి బంధువుకు సమాచారం అందించగా సమీప బంధువు దానిని ప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వీరభద్రరావు తెలిపారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

ముసునూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): భార్యను వేధింపులకు గురిచేస్తున్న భర్తపై ముసునూరు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్ఐ ఎం.చిరంజీవి తెలిపిన వివరాలివి.. నూజివీడు మండలం రావిచర్ల గ్రామానికి చెందిన జలాది సంజీవరావుకు ముసునూరుకు చెందిన ప్రమీలతో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. గత కొంతకాలం నుంచి సంజీవరావు తరచూ మద్యం తాగివచ్చి ఆమెను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

సారా విక్రయాలపై దాడులు.. ముగ్గురిపై కేసు

ముసునూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): లోపూడిలో సారా విక్రయాలపై ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. సీఐ ఎమ్మెస్సాయి, ఎస్ఐ బి.రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన దాడుల్లో బొర్రా దుర్గాశక్తిని అదుపులోకి తీసుకుని ఆమె వద్ద నుంచి లీటరు సారాను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ తెలిపారు. ఆమెతోపాటు భర్త చెన్నారావు, తండ్రి రాములుపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

నెలరోజుల్లో కొత్తగూడెం రీసర్వే భూసమస్యలు పరిష్కరిస్తాం

» నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ వినూత్న

చాట్రాయి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కొత్త గూడెంలో రీసర్వే భూ సమస్యలు పరిష్కా రానికి నవంబరు పదో తేదీలోపు లక్ష్యంగా పెట్టుకున్నామని నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న స్పష్టం చేశారు. గురువారం గ్రామ సచివాలయంలో తహసీల్దార్ భద్రు అధ్యక్షతన రీసర్వే గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా గ్రామసభకు వచ్చిన ప్రతి రైతు నుంచి ఆమె అర్జీ తీసుకుని సమస్య విని, రికా ర్డులు పరిశీలించి పరిష్కరించాలని అధికారు లకు ఆదేశాలు ఇచ్చారు. సబ్ కలెక్టర్‌తో రైతులు మాట్లాడుతూ రీసర్వే సమయంలో ఎక్కువ శాతం మంది రైతులకు కనీసం నోటీ సులు ఇవ్వలేదని, ఆఫీసులో కూర్చొని ఆన్‌లైన్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్ని భూములు ఫ్రీజింగ్‌లో పెట్టడం వల్ల పంట రుణాలు ఇతర సబ్సిడీలు కోల్పోతున్నామని వివరించారు. దీనిపై ఆమె మాట్లాడుతూ రీసర్వే సమస్యలు పరిష్కరించడానికి ప్రభు త్వం ఒక నెల సమయం ఇచ్చిందని, దీనిపై యాక్షన్ ప్లాన్ తయారు చేసి నవంబరు పదో తేదీలోగా క్లియర్ చేస్తామన్నారు. రైతులు ఆందోళన చెందవద్దని, అందరి సమస్యలు పరిష్కారం అవుతాయని హామీ ఇచ్చారు. త్వరలో 'ఫేజ్-3 రీసర్వే ప్రారంభం కానున్నం దున కొత్తగూడెం సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. డీటీ ఈశ్వరరావు, సర్పంచ్ చల్లగుళ్ల వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు మండవల్లి సుబ్రహ్మణ్యం, వెల్ది నాగేశ్వరరావు, రాజారత్నం రెవెన్యూ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

రాజధాని నిర్మాణానికి రూ.10 వేలు విరాళం



విరాళం పంపుతున్న సర్పంచ్ వెన్నేశ్వరరావు, ఉప సర్పంచ్ నాగేశ్వరమ్మ

ముదినేపల్లి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాజధాని నిర్మాణానికి విరాళాలివ్వాలని అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలన్న అమరావతి బ్రాండ్ అంబాసిడర్, ముది నేపల్లికి చెందిన వైద్య విద్యార్థిని ఆయిలు వైష్ణవి ఇచ్చిన పిలుపునకు స్పందించిన శ్రీహరిపురం గ్రామ పంచాయతీ పాలకవర్గం, గ్రామ సచివాలయ ఉద్యోగులు గురువారం తమ విరాళాలను ఏపీసీఆర్‌డీఏ బ్యాంకు ఖాతాకు పంపించారు. సర్పంచ్ వరసా వెన్నేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్ర మంలో ఆయనతో పాటు ఉపసర్పంచ్ బత్తుల నాగేశ్వరమ్మ, సభ్యులు, పంచాయతీ కార్యదర్శి జయకృష్ణవేణి, గ్రామ సచివాలయ ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు సుమారు రూ. 10 వేలు పంపారు. వైష్ణవి తండ్రి డాక్టర్ మనోజ్ పాల్గొన్నారు.




ప్రతికను ఆవిష్కరిస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ తదితరులు

ట్రిపుల్ ఐటీలో ప్రజ్ఞా మాసపత్రిక ఆవిష్కరణ

నూజివీడు టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) :ప్రజ్ఞా మాసపత్రికను తీసుకొచ్చిన నూజివీడు ట్రిపుల్ ఐటీ డైరెక్టర్, ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ఎస్.అమరేంద్రకుమార్ గురువారం లాంఛ నంగా ఆవిష్కరించారు. నూజివీడు ట్రిపుల్ ఐటీలో ప్రజ్ఞాపేరుతో మాసపత్రికను ప్రారం భించారు. విద్యార్థుల్లో చైతన్యాన్ని, ప్రతి భను, నూతన ఆవిష్కరణలను ప్రమోషన్ వారికి ప్రోత్సాహం కల్పించడంతో పాటు వారిలో పెం పొందించే దిశగా ఈ పత్రిక పనిచే స్తుందని డైరెక్టర్ అమరేంద్రకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజ్ఞా పత్రి కతో పాటు ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఆయ న ఆవిష్కరించారు. ఏవో డాక్టర్ లక్ష్మణ రావు, డీన్ డబ్బా డాక్టర్ రాజేష్, దుర్గాభవాని, ఇంగ్లీష్ విభాగం అసిస్టెం ట్ ప్రొఫెసర్ ఎం.దివ్యశ్రీ పాల్గొన్నారు.

పెండ్లి కుమార్తెకు బంగారు నాణెం అందజేత



బంగారు నాణెం అందజేస్తున్న నాయకులు

చాట్రాయి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పర్వతాపురం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో పాడి రైతు మిద్ది శివ ప్రసాద్ కుమార్తె సాయిశ్రీ వివాహం గురువారం జరిగింది. కృష్ణా మిల్క్ యూనియన్ కల్యాణమస్తు పథకం కింద రూ.20 వేలు విలువైన బంగారు నాణేన్ని పెండ్లి కుమార్తెకు తిరువూరు క్లస్టర్ మేనేజర్ దిలీప్‌కుమార్, సర్పంచ్ మిద్దె శివాజీ, సంఘం అధ్యక్షులు తెల్లు రావు, పేతన కార్యదర్శి నారాయణరావు, పాడి రైతులు పాల్గొన్నారు. అందజేశారు. సూపర్‌వైజర్ నరసింహ

'బాణసంచా దుకాణదారులు జాగ్రత్తలు పాటించాలి'

చాట్రాయి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి) దీపావళి సందర్భంగా బాణసంచా దుకాణ దారులు అన్ని జాగ్రత్తలు పాటించాలని నూజివీడు రూరల్ సీఐ కె.రామకృష్ణ కోరారు. చాట్రాయి పోలీస్‌స్టేషన్‌లో గురు వారం ఏర్పాటు చేసిన బాణసంచా దుకా ణదారుల సమావేశంలో ముందు జాగ్ర త్తలపై సీఐ అవగాహన కల్పించారు.

నూజివీడు ఎంఈవో-2 ఎక్కడ ?

డీఈవో ఆదేశాలతో డీవైఈవో విచారణ

ఏలూరు అర్బన్, అక్టోబరు 9 (ఆంధ్ర జ్యోతి) : విధులకు గైర్హాజరవుతుండడంపై నూజివీడు ఎంఈవో-2 ఎస్.జమలయ్య ఎక్కడ ఉన్నారో వాక బు చేసి నివేదిక సమర్పించాలని డీఈవో వెంకట లక్ష్మమ్మ మౌఖిక ఆదేశాల మేరకు గురువారం నూజివీడు ఉపవిద్యాశాఖాధికారి సుధాకర్ విచార ణ నిర్వహించి రిపోర్టును జిల్లా విద్యాశాఖకు పం పించారు. దీనిపై డిప్యూటీఈవో సుధాకర్ వివరిస్తూ గతనెల 24న ఎంఈవో-2 తన కార్యాలయానికి వచ్చారని, తదుపరి ఈ నెల 8న విధులకొచ్చారిగా తనతో ఫోన్‌లో మాట్లాడారని, అప్పటినుంచి ఇంతవరకు ఆయన కనబడలేదన్నారు. విధులకు సెలవు పెడుతున్నట్లుగా ఎటువంటి సమాచారం ఇవ్వలేదని, ఆ మేరకు లీవ్ యాప్‌లో కూడా నమోదు చేయలేదని, యూపీ చేయడం లేదని తన దృష్టికి వచ్చాయని తెలిపారు. ఆయన ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉందని వివరించారు. జమలయ్యతో పాటు ఒకే కార్యా లయంలో విధులు నిర్వర్తించే ఎంఈవో-1, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్లను కూడా ఆరా తీయగా ఆయన ఆఫీసుకు రావడం లేదని చెప్పా రన్నారు. ఈ విషయాన్ని డీఈవోకు అందజేసిన విచారణ నివేదికలో తెలియజేశానన్నారు. తదుపరి జమలయ్య కుటుంబ సభ్యుల చిరునామా తెలుసు కుని వాకబు చేయాల్సి ఉందన్నారు. కాకినాడ ఆర్జేడీ, డీఈవో ఆదేశాలమేరకు మండలంలో విద్యా శాఖ కార్యకలాపాల నిర్వహణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

పలు సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షుల నియామకం

ఆగిరిపల్లి, అక్టోబరు 9, (ఆంధ్రజ్యోతి) : ఆగిరి పల్లి మండలంలో పలు సంఘాలకు నియామక పత్రాలు పంపిణీ చేశారు. ప్రెసిడెంట్, వైస్ ప్రెసిడెంట్, ఎస్సీ సెల్, బీసీ సెల్ పలు విభాగాల అధ్యక్ష, ఉపాధ్యక్ష సభ్యులను మంత్రి కొలుసు పార్థసారథి ప్రకటిం చారు. గురువారం ఆగిరిపల్లిలో టీడీపీ శ్రేణుల నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఎంపికైన సభ్యులు పార్టీ క్రమ శిక్షణతో, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలన్నారు. ఎంపి కైన అధ్యక్ష, ఉపాధ్యక్ష సభ్యులు మాట్లాడుతూ మా మీద నమ్మకంతో మమ్మల్ని ఆశీర్వదించి, బాధ్యతలు అందించిన రాష్ట్ర మంత్రి పార్థసారథికి, పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.2 లక్షల బీమా అందజేత

చాట్రాయి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మండ లంలోని కోటపాడు ఇండియన్ బ్యాంకు ఖాతా దారుడు పేక్ బాజీ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. అతడు ఏడాదికి రూ.436 చెల్లించి పీఎంజేజేబీవై పాలసీ తీసుకోవడంతో రూ.2 లక్షలు చెక్కును గురువారం బ్యాంకు మేనేజర్ హేమంత్ మృతుని భార్య జీనాబీకి అందజేశారు. కార్యక్ర మంలో ఆర్థిక అక్షరాస్యతా కేంద్ర కౌన్సిలర్ బి. చెన్నారావు, కె.గోపయ్య, వి.నవీన్ పాల్గొన్నారు.



కాల్వను పరిశీలిస్తున్న ఎంపీడీవో ఫణీంద్ర

కాలువలో కలుషిత నీరు వదిలితే చర్యలు

కలిదిండి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కొత్తూరు -పెదలంక పంట కాలువలో కలుషిత నీరు వదిలితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో ఆర్.ఫణీంద్ర హెచ్చరించారు. ఆంధ్రజ్యోతిలో ఇటీ వల ప్రచురితమైన 'మురుగునీర్లు వర్రాలు కాల్వలోనే' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికా రులు స్పందించారు. గురువారం ఎంపీడీవో ఫణీంద్ర, పంచాయతీ కార్యదర్శులతో కలిసి కొత్తూరు-పెదలంక కాల్వను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాల్వ వెంబడి ఉన్న ఇళ్లలో మురుగునీరును, చేపల, రొయ్యల చెరువుల్లో కలుషిత నీరు వదిలే వారిని గుర్తించి నోటీసులు జారీ చేస్తామన్నారు. కొత్తూరు, సంతోష పురం, భాస్కరరావుపేట, ముల్లంక, పెదలంక గ్రామాల్లో కాల్వ వెంబడి చెత్త డంపులను తొలగిం చి హెచ్చరిక బోర్డులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. డీసీ చైర్మన్ ముద్దం బోగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇక భోజనం భేష్


(5వ పేజీ తరువాయి)

ఆచరణలోకి వచ్చింది. ప్రస్తుతం దసరా సెలవుల అనంతరం కళాశాలకు వస్తున్న విద్యార్థులకు ఈ ఫౌండేషన్ ద్వారా శాకాహార భోజనాన్ని అందిస్తున్నారు. మెనూ ప్రకారం విద్యార్థులకు ప్రతిరోజూ గుడ్డు, వారానికి ఒకసారి మాంసాహారం అందించాల్సి ఉండగా, నదరు బాధ్యతలను మెప్మాకు గాని లేదా ట్రిపుల్ ఐటీలోని విద్యార్థుల ఆధ్వర్యంలో నడుస్తున్న స్వచ్ఛంద సేవాసంస్థ అయిన 'హెల్పింగ్ హ్యాండ్స్' సంస్థకు అందించాలని ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఆదివారం జరుగనున్న గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ఈ నిర్ణయంపై చర్చించి మాంసాహారం, గుడ్డు విద్యార్థులకు అందించేందుకు చర్యలు చేపట్టనున్నారు.

ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ ఆసుపత్రుల బంద్‌కు సన్నాహాలు

(5వ పేజీ తరువాయి)

వైద్యసేవ ట్రస్టు జిల్లా కో-ఆర్డినేటర్ డాక్టర్ రాజీవ్ వెల్లడించారు. జిల్లాలో ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద ఉచిత వైద్యచికిత్సలందించేందుకు 32 నెట్‌వర్క్ ఆసుపత్రులున్నాయి. ఒకవేళ నెట్‌వర్క్ ఆసుపత్రులు శుక్రవారం నుంచి ఉచిత వైద్యచికిత్సలను నిలిపివేస్తే, నెట్‌వర్క్ హాస్పిటల్స్ జాబితాలో ఉన్నప్పటికీ సమ్మెతో సంబంధం లేకుండా ఏలూరు ఆశ్రం వైద్యకళాశాల ఆసుపత్రి, గుడ్ సమారిటన్ క్యాన్సర్, జనరల్ ఆసుపత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవ కింద వైద్యసేవలను నిబంధనల మేరకు కొనసాగించాల్సి ఉంటుందని వివరించారు. పేషెంట్లను ఆశ్రం, గుడ్ సమరిటన్, ఏలూరు, విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రులకు తరలించేందుకు వీలుగా 108 వాహనాలు, వైద్యసిబ్బందిని సిద్ధం చేసినట్టు తెలిపారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	127, 136, 147
చికెన్ విత్ స్కిన్	242
చికెన్ స్కిన్‌లెస్	252
నెక్ కోడి గుడ్డు ధర	(100)
విజయవాడ బోన్ రైతు ధర రూ.475	